
ఆంధ్రజ్యోతి
****

ANDHRAJYOTHY



నల్లగొండ

5

గురువారం 5 డిసెంబరు 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 78

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.112	185	205
సూర్యాపేట	రూ.125	190	210
నల్లగొండ	రూ.130	190	220

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.0 । కనిష్ఠం 19.0

సీఎం పర్యటనకు ఏర్పాట్లు ముమ్మరం

- ఈ నెల 7న జిల్లాకు రేవంత్‌రెడ్డి రాక
- బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు, యాదాద్రి పవర్‌ప్లాంట్ ప్రారంభోత్సవాలు
- మెడికల్ కళాశాల ప్రారంభోత్సవం కూడా
- సాయంత్రం ఎన్‌జీ కళాశాలలో భారీ బహిరంగసభ
- ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్ ఇలాత్రిపాఠి





నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లంలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న నల్లగొండ కలెక్టర్ ఇలాత్రిపాఠి

నల్లగొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనకు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఈ నెల ఏడో తేదీన నల్లగొండ జిల్లా పర్యటన ఖరారైన నేపథ్యంలో అధికారులు అన్ని పనులను పూర్తి చేస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడిచిన సందర్భాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తోన్న ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా జిల్లాలో పలు అభివృద్ధి పథకాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. బ్రాహ్మణ వెల్లంల ఎత్తిపోతల పథకం ద్వారా కాల్వలకు నీటి విడుదలతోపాటు, దామరచర్ల మండలం వీర్లపాలెంలోని యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంటులో యూనిట్-2 ద్వారా విద్యుదుత్పత్తికి సీఎం ప్రారంభోత్సవం చేస్తారు. అదేవిధంగా నల్లగొండలోని మెడికల్ కళాశాలను ఆయన ప్రారంభిస్తారు. అక్కడే నర్సింగ్ కళాశాలకు శంకుస్థాపన చేస్తారు. వీటితో పాటు నల్లగొండ మునిసిపాలిటీ పరిధిలోని రైతుబజార్ వద్ద నిర్మించతలపెట్టిన నైపుణ్యాభివృద్ధి కేంద్రానికి, పలు మునిసిపల్ పనులకు సీఎం శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం జిల్లాకేంద్రంలోని ఎన్జీ కాలేజీ ప్రాంగణంలో జరిగే ప్రజాపాలన విజయోత్సవ సభలో సీఎం ప్రసంగిస్తారు. ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి హెలికాప్టర్‌లో

- మిగతా 6వ పేజీలో...

రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత గత ప్రభుత్వం నిర్వహించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల పథకాన్ని ఈ ప్రభుత్వం రద్దుచేసింది. దాని స్థానంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తామని ప్రకటించింది. అయితే కొత్తగా ఇళ్లు కావాల్సిన వారికి ఇందిరమ్మ ఇళ్ల పథకం వర్తింపజేయడంలో ఎలాంటి ఆటంకాలు లేకపోయినా, గత ప్రభుత్వం హయాంలో నిర్మించి లబ్ధిదారులకు ఇవ్వకుండా వదిలేసిన ఇళ్ల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంపై అర్హులు, లబ్ధిదారుల్లో అయోమయం నెలకొంది. ఈ ఇళ్ల కేటాయింపులకోసం దాదాపు ఏడాది కాలంగా ఎలాంటి కార్యాచరణ లేకపోవడంతో ఆ ఇళ్లు శిథిలావస్థకు చేరాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం వెచ్చించిన డబ్బు బూడిదలో పోసిన పన్నీరవుతుందని, తక్షణం ఈ ఇళ్లను లబ్ధిదారులకు అందజేయాలని కోరుతున్నారు.

- పథకంపై తేలని ప్రభుత్వ నిర్ణయం
- నిర్మాణం పూర్తయి ఏడాది అవుతుండడంతో శిథిలావస్థకు చేరుతున్న ఇళ్లు
- ప్రభుత్వం పట్టించుకోపోతే కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తవుతున్నా, గత ప్రభుత్వ హయాంలో నిర్మించి వదిలేసిన డబల్‌బెడ్‌రూమ్ ఇళ్ల ని ఇప్పటివరకు లబ్ధిదారులకు కేటాయించలేదు. దీంతో అవి శిథి లావస్థకు చేరే దుస్థితి నెలకొంది. ఎంతో ఆశతో డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లలోకి వెళతామనుకున్న వారికి నిరాశే ఎదురవుతోంది. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వమైనా తమకు ఇళ్లు కేటాయించకపోతుందా? అని నిరీక్షిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

'డబుల్' పరేషాన్!





ఉమ్మడి జిల్లాలో 4,716 డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విఫలమైన పథకంగా డబల్‌బెడ్‌రూమ్ ఇళ్ల పథకం మిగిలిపోయింది. ఇళ్లులేని నిరుపేదలందరికీ డబల్‌బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిస్తామని గొప్పగా ప్రకటించినప్పటికీ పదేళ్లలో లక్ష్యాన్ని చేరలేక ప్రభుత్వం చతికిలపడింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 20వేల ఇళ్లను మాత్రమే మంజూరు చేసినా, వాటిల్లో కేవలం 6,360 ఇళ్లు మాత్రమే నిర్మించారు. నిర్మించిన ఇళ్లల్లోనూ ఎన్నికల సమయానికి కేవలం 1,644 మంది లబ్ధిదారులకు మాత్రమే కేటాయించగా, మరో 4,716 ఇళ్లు అర్హులకు కేటాయించకపోవడం, వాటికోసం ఎన్నికల షెడ్యూల్ వచ్చే వరకూ లబ్ధిదారుల ఎంపిక అప్పటి ఎమ్మెల్యేలు సందిగ్ధత కొనసాగించడంతో చివరకు ఆ ఇళ్లను ఎవరికీ కేటాయించలేకపోయారు. దీంతో ఆ ఇళ్లన్నీ ప్రస్తుతం ఎవరూ నివాసం ఉండకపోవడంతో క్రమంగా శిథిలమవుతున్న పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి కూడా ఏడాది గడుస్తున్నందున, తక్షణం ఈ ఇళ్లను లబ్ధిదారులకు ఇస్తేనే ఉపయుక్తంగా ఉంటుందనే సూచనలు వస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం 4,716 ఇళ్లు ప్రస్తుతం నిర్మించి అందుబాటులో ఉన్నాయి. వీటిలో అత్యధికంగా సూర్యాపేట నియోజకవర్గంలో 1,358 ఇళ్లు, నల్లగొండలో 710 ఇళ్లు, మిర్యాలగూడలో 640, కోదాడ లో 560, భువనగిరిలో 641, తుంగతుర్తి 211, నకిరేకల్‌లో 534, ఆలేరులో రెండు ఇళ్లు లబ్ధిదారుల కు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించకపోగా, ఇళ్లు నిర్మించిన కాలనీల్లోనూ పూర్తిస్థాయిలో రోడ్లు, విద్యుత్ సదుపాయాలు, తాగునీటి పైప్‌లైన్ల నిర్మాణాలు, డ్రైనేజీల నిర్మాణాలు ఇంకా పూర్తిగా చేపట్టలేదు. వీటికి కూడా నిధులు మంజూరైనా పనులు చేయకపోవడంతో ఆ నిధులన్నీ వెనక్కిపోయాయి. ప్రస్తుతం తక్షణమే లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేసి, మౌలికవసతులు కల్పిస్తే ఈ ఇళ్లకోసం వెచ్చించిన ప్రజాధనం వృథా కాకుండా కాపాడిన వారవుతారని,ఈ అంశంపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టిసారించాలని అర్హులైన లబ్ధిదారులు కోరుతున్నారు. ఈ ఇళ్ల కేటాయింపులు, మౌలికవసరుల కల్పనపై హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్‌ని 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా, ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదని, తదుపరి ఆదేశాలొచ్చే వరకూ యథాతథంగా వాటిని సంరక్షిస్తామని పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

నాణ్యమైన ఆహారం అందించాలి

సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్



వసతిగృహ అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్

దామరచర్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ అన్నారు. మండలకేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించిన అనంతరం వంట గదిని పరిశీలించారు. అనంతరం ఆయన విద్యార్థులతో మాట్లాడి వసతులపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ ఉన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి



చెక్కును మహిళా సంఘాలకు అందజేస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, మునుగోడు రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదగాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మునుగోడులో ప్రజాపాలన-ప్రజా విజయోత్సవ సభలో పాల్గొని మాట్లాడారు. మహిళల ఆదరణతోనే అధికారంలోకి వచ్చిన తమ ప్రభుత్వానికి వారి మద్దతు ఉన్నంత కాలం ఏంకాదన్నారు. అంతకుముందు మండలంలోని పులిపలుపుల, కొరటికల్, బీరెల్లిగూడెం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కొంపల్లి గ్రామంలోని సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నారబోయిన రవి, వట్టికోటి శేఖర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీమనపల్లి సైదులు, దోటి నారాయణ, తాటికొండ సైదులు, మేకల ప్రమోద్ రెడ్డి పాల్గొన్నారు.

భయపెట్టిన భూ ప్రకంపనలు

- సెకన్లపాటు కంపించిన భూమి
- ఆందోళన చెందిన ప్రజలు

7

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

కలెక్టర్ ఇలాత్రిపాఠి



జిల్లాకేంద్రంలో సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి, సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

నల్లగొండ టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన ఈ నెల 7న ఉన్నందున అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై బుధవారం ఆమె కలెక్టరేట్‌లో సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్, రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, తదితర అధికారులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి హాజరయ్యే ప్రదేశాలు, అక్కడ చేయాల్సిన ఏర్పాట్లు, పోలీస్ బందోబస్తు, తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల నిమిత్తం సీఎం రానున్నందున అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. సీఎం పర్యటన ఏర్పాట్లలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ మాట్లాడు తూ ముఖ్యమంత్రి రాక సందర్భంగా అవసరమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు జేసీ శ్రీనివాస్, అదనపు ఎస్పీ రాములు నాయక్, ఇరిగేషన్ సీఈ అజయ్ కుమార్, ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఇరిగేషన్ అధికారులు, ఆర్డీవో అశోక్ రెడ్డి, డీఎస్పీ శివరాంరెడ్డి పాల్గొన్నారు.

థర్మల్ ప్లాంట్ పరిశీలన

దామరచర్ల: యాదాద్రి థర్మల్ ప్లాంట్‌ను సీఎం రేవంత్‌రెడ్డి సందర్శించనున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లను మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. సీఎం ప్రారంభించనున్న యూనిట్-2ను ఆయన పరిశీలించి ఆ ప్రాంతంలోని ఏర్పాట్లపై జెన్‌కో అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఆయనవెంట సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, డీఎస్పీ రాజశేఖర్‌రాజు, అధికారులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనకు అన్ని ఏర్పాట్లను చేస్తున్నామని కలెక్టర్ ఇలాత్రిపాఠి తెలిపారు. సీఎం ఇతర జిల్లా మంత్రులతో కలిసి నార్కట్‌పల్లి మండలంలోని బీ.వెల్లెంల ఉదయ సముద్రం ఎత్తిపోతల ప్రాజెక్టును ప్రారంభించనున్న దృష్ట్యా చేయాల్సిన ఏర్పాట్లపై ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఇతర జిల్లా అధికారులతో కలిసి బుధవారం ఆమె బీ.వెల్లెంల ఉదయ సముద్రం ప్రాజెక్టును పరిశీలించారు. రిజర్వాయర్ కట్ట దిగువన ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌ను, పైలాన్‌ను ఆమె పరిశీలించి తగు సూచనలు చేశారు. కలెక్టర్‌వెంట అదనపు ఎస్పీ రాములు నాయక్, నీటిపారుదల శాఖ సీఈ అజయ్‌కుమార్, ఈఈ గంగం శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో అశోక్‌రెడ్డి,డీఎస్పీ శివరాంరెడ్డి,ఇతర అధికారులు ఉన్నారు.

నిబంధనల మేరకు ప్రణాళికలు రూపొందించాలి

నల్లగొండ: స్థానిక సంస్థల్లో 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి, నియమ నిబంధనల ప్రకారం 2024-25 సంవత్సరానికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం ఆమె జిల్లా పరిషత్ కార్యాలయంలో 2024-25 సంవత్సరానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగానికి రూపొందించే కార్యాచరణ ప్రణాళికపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీ భవనాలు, ఆరోగ్య ఉపకేంద్రాలు, రైతు వేదికలు అన్ని ప్రభుత్వ సంస్థలకు తాగునీరు అందించేందుకు ప్ర ణాళికలో చేర్చాలన్నారు. ఈ విషయమై ప్రత్యేకాధికారు లు శ్రద్ధ తీసుకోవాలన్నారు. స్థానిక పరిస్థితులను ఆధారంగా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డిప్యూటీ సీఈవో శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

విజయోత్సవాలతో ప్రజాధనం దుర్వినియోగం

జడ్పీ మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల



సమావేశంలో మాట్లాడుతున్న కంచర్ల భూపాల్‌రెడ్డి, పక్కన నరేందర్‌రెడ్డి

నల్లగొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఏడాది పాలనపై విజయోత్సవాల పేరిట ప్రజాధనాన్ని ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి విమర్శించారు. జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ నోటిఫికేషన్లు వేస్తే, ఇప్పుడు తాము ఉద్యోగాలు ఇచ్చినట్లు అబద్ధపు ప్రచారం చేసుకుంటురని విమర్శించారు. ఈ నెల 7న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నల్లగొండ పర్యటనకు వస్తున్న సందర్భంగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి రూ.250కోట్లు, ఏఎమ్మార్పీ ప్రాజెక్టుకు రూ.1500కోట్లు కేటాయించాలని వినతిపత్రం అందజేస్తామన్నారు. నల్లగొండ అభివృద్ధికి గత ప్రభుత్వం రూ.1350కోట్లు కేటాయించిందని, ఆ పనులను కొనసాగించాలని కోరారు. తెలంగాణ సంపదను దోచుకున్న కాంగ్రెస్ ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల కోసం ఖర్చు పెడుతుందని ఆరోపించారు. రైతు భరోసా ఇవ్వడంలో నిర్లక్ష్యం చేస్తోన్న ప్రభుత్వం రుణమాఫీ కూడా పూర్తి చేయలేదన్నారు. ఎనిమిది కేసులు ఎదుర్కొంటు న్న ఓ క్రిమినల్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మాజీ మంత్రి హరీష్‌రావుపై కేసులు నమోదు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు కటికం సత్తయ్యగౌడ్, నిరంజన్‌వలీ, బొర్ర సుధాకర్, మందడి సైదిరెడ్డి, బోనగిరి దేవేందర్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, అభిమన్యు శ్రీనివాస్, కరీంపాషా, నారబోయిన భిక్షం, గోవర్ధన్, సహదేవారెడ్డి పాల్గొన్నారు.

ఏం సాధించారని.. ప్రజా విజయోత్సవాలు : చిరుమర్తి

నార్కట్‌పల్లి: ఏం సాధించారని, ప్రజలకు ఏం మేలు చేసిందని ప్రభుత్వం ప్రజా విజయోత్సవాలు నిర్వహిస్తోందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రశ్నించారు. నార్కట్‌పల్లిలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులు కష్టించి పండించిన ధాన్యాన్ని నష్టానికి మిల్లర్లకు అమ్ముకున్నందుకా.. బోనస్ ఇస్తానని బోగస్ చేసినందుకా.. .గురుకులాలను నరక కూపాలుగా మార్చినందుకా అని ప్రశ్నించారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భైరెడ్డి కరుణాకర్‌రెడ్డి, మేకల రాజిరెడ్డి, దుబ్బాక శ్రీధర్, వాజిద్, శంకర్ పాల్గొన్నారు.

కుట్రల వెనుక ప్రవీణ్‌కుమార్ హస్తం

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



సమావేశంలో మాట్లాడుతున్న దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్

పెద్దఅడిశర్లపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలల్లో కుట్రల వెనుక బీఆర్ఎస్‌నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హస్తముందని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ ఆరోపించారు. మండలకేంద్రంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ బదలాంచేయాలని చూస్తోందన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ గురుకులాల కార్యదర్శిగా పనిచేశారని, తన అనుచరులనే సిబ్బందిగా నియమించుకున్నారని ఆరోపించారు. అన్ని హాస్టల్స్‌లో ప్రవీణ్‌కుమార్ అనుచరులు ఉన్నారని, త్వరలోనే అన్ని విషయాలు బయటకు వస్తాయన్నారు. గత ప్రభుత్వంలో ఎప్పుడైనా విద్యార్థుల గురించి అలోచించారా అని ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం 40శాతం కాస్మోటిక్ చార్జీలు పెంచిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరబోయిన ఎల్లయ్యయాదవ్, సతీష్‌రెడ్డి, వంగాల ప్రతాప్‌రెడ్డి, బోడియానాయక్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు, తిరుమలగిరి, మేడారం, చింతల్ తండా గ్రామాలో నూతనంగా సీసీరోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బాలునాయక్ శంకుస్థాపన చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను ప్రభుత్వం అమలు చేసి చూపించిందన్నారు. గత ప్రభుత్వ హయంలో ఒక కుటుంబం అధికార ధన దాహానికి తెలంగాణ రాష్ట్రం ఆగమై అప్పులపాలైందన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు.

విద్యార్థినులకు పరామర్శ

దేవరకొండ: పీఏపల్లి మోడల్‌స్కూల్ విద్యార్థులకు ఎలాంటి ఫుడ్‌పాయిజన్ జరగలేదని, కడుపునొప్పి రావడంతో అస్వస్థతకు గురయ్యారని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. అస్వస్థతకు గురై దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను బుధవారం పరామర్శించారు.

విద్యార్థుల అస్వస్థతపై విచారణ

ఆహార పదార్థాలను ల్యాబ్‌కు పంపిన అధికారులు

పెద్దఅడిశర్లపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): దుగ్యాల ఆదర్శ బాలికల వసతిగృహంలో ఐదుగురు విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై బుధవారం విచారణ కొనసాగింది. సివిల్‌సప్లయ్ జిల్లా అధికారి హరీష్, డీఎంహెచ్‌వో డాక్టర్ పట్ల శ్రీనివాస్ విచారణ చేపట్టారు. ఈ నెల 3వ తేదీన సాయంత్రం ఐదుగురు విద్యార్థులు కడుపునొప్పి, తలనొప్పితో దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. విషయం తెలిసిన వెంటనే అదే రోజు రాత్రి కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆస్పత్రికి వెళ్లి విద్యార్థులను పరామర్శించి, ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలుసుకోవాలని ఆదేశించారు. దీంతో బుధవారం ఉదయం సివిల్‌సప్లయ్ జిల్లా అధికారులు, వైద్యాధికారులు ఆదర్శ పాఠశాలకు చేరుకుని సిబ్బందిని, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ఎమ్మెల్యే బాలూనాయక్ పాఠశాలను సందర్శించి,అక్కడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.మూడు రోజులుగా సరైనఆహారం తీసుకోకపోవడంతో విద్యార్థులు డీహైడ్రేషన్‌కు గురయ్యారన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

- హిందూ ఐక్యవేదిక డిమాండ్



జిల్లాకేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ ఐక్యవేదిక కార్యకర్తలు, నాయకులు

నల్లగొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని హిందూ ఐక్యవేదిక నల్లగొండ అధ్యక్షుడు నేతి రఘుపతి, ప్రధాన కార్యదర్శి కట్ట సూర్య సపంత్ డిమాండ్‌చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న ఘటనలకు నిరసనగా బుధవారం హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హింసకు పాల్పడిన దోషులపై చర్యలు తీసుకోవడంలో బంగ్లాదేశ్ ప్రభుత్వం ప్రేక్షక పాత్ర వహిస్తుందన్నారు. అనంతరం కలెక్టర్ ఇలాత్రిపాఠిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వేదాంతం రామకృష్ణ, అంజిరెడ్డి, రమేష్, రాంప్రసాద్, వెంకటయ్య, హరి రామకృష్ణ, గార్లపాటి వెంకటయ్య, కాశమ్మ, కన్నెబోయిన వెంకట్, నరేష్, సంపత్, ఇటికాల కృష్ణయ్య, వీరేష్, సైదులు, బండారు ప్రసాద్, మాదగోని శ్రీనివాస్ గౌడ్, గోపికృష్ణ, నాగం వర్షిత్ రెడ్డి, శ్రవణ్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధం

- బీఆర్ఎస్, బీజేపీ నేతలకు కనీస అవగాహన లేదు



సమావేశంలో మాట్లాడుతున్న బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, పక్కన గుమ్మల మోహన్‌రెడ్డి

నల్లగొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన అభివృద్ధి పనులపై చర్చకు సిద్ధంగా ఉన్నామని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, నల్లగొండ మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. నల్లగొండ నియోజకవర్గంలో మంత్రి వెంకట్‌రెడ్డి చేసిన అభివృద్ధి బీఆర్ఎస్, బీజేపీ నాయకులకు కన్పించడం లేదా అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో రోడ్లు, ట్రాన్స్‌ఫార్మర్‌లు, మెడికల్ కళాశాల, ఆర్డీవో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, ఎంజీ యూనివర్సిటీ, రైల్వే ఫ్లైఓవర్, నల్లగొండలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీరోడ్లన్నీ మంత్రి వెంకటరెడ్డి హయాంలో జరిగిన పనులేనని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశామన్నారు. మాస్టర్ ప్లాన్ గురించి అవగాహన కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. నల్లగొండ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి ఎప్పటికీ ఎమ్మెల్యేగా గెలవలేడని అన్నారు. ఈ నెల 7న జరిగే సీఎం రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మునిసిపల్ వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్, నల్లగొండ, తిప్పర్తి, కనగల్ మాజీ జడ్పీటీసీలు వంగూరి లక్ష్మయ్య, పాశం రాంరెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, అనుపరెడ్డి పాల్గొన్నారు.

ఆవరిస్తున్న చీకటి

సర్వేంద్రియానాం నయనం ప్రధానం. జీవ మనుగడకు కళ్లు ప్రధానమైనవి. అలాంటి నేత్రాలు చిన్నవయస్సులోనే దెబ్బతింటున్నాయి. ఒకప్పుడు వయసు మందగించిన వారికే చూపు మందగించేది. 40 ఏళ్లు దాటిన తర్వాతే కంటి సమస్యలు వచ్చేవి. ప్రస్తుతం ఐదేళ్ల చిన్నారులూ కంటి సమస్యలతో బాధపడుతున్నారు. అధికఒత్తిడి, సెల్‌ఫోన్లు, కంప్యూటర్ల వినియోగం, పోషకాహారలోపం వెరసి చిన్నారులు కంటి జబ్బుల బారిన పడుతున్నారు. కళ్లజోడు లేకుండా ఏ పనీ చేయలేకపోతున్నారు. ఈ సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. సూర్యాపేట జిల్లాలో సుమారు 20 వేల మందికి పైగా చిన్నారులు కంటి సమస్యలతో బాధపడుతున్నారు.

- చిన్నబోతున్న చిన్నారుల చూపు
- పిల్లల్లో పెరుగుతున్న దృష్టిలోపం
- ఒత్తిడి, పోషకాహారలోపమే కారణం
- సంరక్షణపై అవగాహన లేమి
- సూర్యాపేట జిల్లాలో 20వేలకు పైన విద్యార్థులకు కంటి సమస్యలు

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట(కలెక్టరేట్)

చిన్నారుల్లో కంటి జబ్బులకు కారణాల్లో ఒత్తిడి ప్రధానమైనది. చదువులో పెరుగుతున్న పోటీని తట్టుకుని నిలబడేందుకు తీవ్రంగా కసరత్తు చేస్తున్నారు. పుస్తకాలు దగ్గరగా పెట్టుకుని చదవడం, రాయడం, వెలుతురు తక్కువగా ఉన్న చోట చదవడం, నడిచే వాహనాల్లో చదవడంతో కంటిపై ప్రభావం చూపిస్తున్నాయి. అదేవిధంగా రాత్రి ఆలస్యంగా నిద్రించడం, ఉదయాన్నే వేకువ జామున నిద్ర లేచి చదవడం, రాయడం చేస్తున్నారు. దీంతో వారికి మానసిక ప్రశాంతత, విశ్రాంతి లేకపోవడంతో కంటి చూపు సన్నగిల్లుతోంది. అదేవిధంగా సెల్‌ఫోన్లు, కంప్యూటర్లలో వీడియో గేమ్‌లు ఆడడం, ఇతర కార్యక్రమాలను చూస్తున్నారు. వీటితో పాటు టీవీలకు దగ్గరగా కూర్చొని ఎక్కువ సమయం గడపటంతో దృష్టి లోపం తలెత్తుతోంది. సరైన పోషకాహారం తీసుకోకపోవడం, విటమిన్ ఏ లోపంతో కూడా కంటి సమస్యలు తలెత్తుతాయి. వాహనాల నుంచి వచ్చే హైడ్రోకార్బన్లతో కంటిలోని భాగాలు దెబ్బతింటాయి. వీటి వల్ల కళ్లు మండటం, విపరీతమైన తలనొప్పితో పాటు ఇతర సమస్యలు ఎదురవుతాయి. సూర్యాపేట జిల్లాలో దృష్టిలోపంతో బాధపడుతున్న విద్యార్థు సంఖ్య సుమారు 20వేల పైనే ఉందని వైద్యులు చెబుతున్నారు.

వైద్యశాఖ విఫలం

చిన్నారులకు కంటి చూపు విషయంలో పూర్తి స్థాయిలో పరీక్షలు, చికిత్సలు అందించడంలో వైద్యఆరోగ్య శాఖ నిర్లక్ష్యం చేస్తోంది. సూర్యాపేట జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించేందుకు ఆప్తమాలజిస్టులు సరిపడా లేరనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో పరీక్షల నిర్వహణ సాధ్యపడటంలేదు. గతంలో కొంత మంది విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించి, అవసరమైన విద్యార్థులకు కళ్లజోళ్లు మాత్రం అందజేశారు. ఆపరేషన్లు అవసరమని తేలితే ఆపరేషన్లు చేసేందుకు జిల్లాలో నేత్ర ఆపరేషన్లు చేసే వైద్యులు లేరు. అంతేకాక విటమిన్ ఏ, డీ లోపం కారణంగా చిన్నారులకు కంటి చూపు సమస్యలు వస్తున్నాయని తెలిసినా విటమిన్ ఏ, డీ మాత్రలను అందించడం లేదు. తొమ్మిది నెలల చిన్నారుల నుంచి ఐదేళ్ల చిన్నారులకు ఆరు నెలలకోసారి ఐదు డోసులుగా విటమిన్ ఏ ద్రావణాన్ని అందించాల్సి ఉంది. ఈ కార్యక్రమం కూడా జిల్లాలో సక్రమంగా అమలు కావడం లేదన్న ఆరోపణలున్నాయి.

ఈ ఏడాది ఆర్‌బీఎ‌స్‌కే కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే సుమారు 51వేల మంది విద్యార్థుకు ఆగస్టు వరకు కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 1,500 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు.

పోషకాహారంతో పరిష్కారం



కంటి సమస్యలకు పోషకాహారమే అసలైన మందు. కంటి చూపును కాపాడుకోవడానికి ఆకుకూరలు, పండ్లు, పాలు, గుడ్లు, మాంసం, కాలేయం, వెల్లుల్లి, తృణధాన్యాలను ఆహారంగా తీసుకోవాలి.కాయగూరలు, వివిధరకాల గింజలు ఎక్కువగా తినాలి. దీంతో పోషకాహారలోపంతో వచ్చే కంటి జబ్బులు 30శాతం వరకు తగ్గే అవకాశం ఉంది. ఒత్తిడిని తగ్గించుకోవాలి. జంక్‌ఫుడ్ తినొద్దు. కంటికి సమస్యలు కలిగితే వెంటనే వైద్యులను సంప్రదించాలి. జిల్లాలోని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో విడతల వారీగా పరీక్షలు నిర్వహిస్తున్నాం. కంటి సమస్య ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి వైద్య సేవలందించడంతో పాటు కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్నాం.

డాక్టర్ కోటి రత్నం, ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్, సూర్యాపేట

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- చిన్నారుల్లో విటమిన్ ఏ లోపం తలెత్తకుండా చూసుకోవాలి.
- పాలు, క్యారెట్‌తో పాటు పోషకాలు కలిగిన ఆహారం ఎక్కువగా తీసుకోవాలి.
- టీవీ చూడడం తగ్గించాలి.
- వాహనాలపై వెళ్లేటప్పుడు హెల్మెట్, కళ్లజోళ్లు తప్పనిసరిగా వాడాలి.
- పుస్తకాలను సరైన వెలుతురులో కొద్దిదూరంలో పెట్టుకుని చదవడం, రాయడం చేయాలి.
- కంప్యూటర్లు, వీడియో గేమ్‌లకు ఎక్కువ సమయం కేటాయించొద్దు.
- కంప్యూటర్ కంటే 30 డిగ్రీల ఎత్తులో కుర్చీ, 40సెంటిమీటర్ల దూరంలో కూర్చొని పనిచేయాలి.
- కనురెప్పలను ఎప్పటికప్పుడు మూస్తూతెరుస్తూ ఉండాలి.
- కంటి సమస్యలు ఎదురైతే నేత్ర వైద్యులను సంప్రదించాలి.
- పిల్లలు చదివేటప్పుడు, ఆడే సమయాల్లో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి.





ప్రజా సమస్యలను గాలికొదిలేసిన ప్రభుత్వాలు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీరయ్య



సమావేశంలో మాట్లాడుతున్న వీరయ్య

మిర్యాలగూడ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను గాలికొదిలేశాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో నిర్వహిస్తున్న సీపీఎం 21వ మహాసభల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతుండగా, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందన్నారు. మూడు రోజులపాటు మిర్యాలగూడలో జరిగిన సీపీఎం 21వ నల్లగొండ జిల్లా మహాసభలు బుధవారం ముగిశాయి. కార్యక్రమంలో కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్య, వీరేపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా కార్యవర్గం ఎన్నిక

నల్లగొండ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీపీఎం నల్లగొండ జిల్లా కార్యవర్గాన్ని బుధ వా రం ఎన్నుకున్నారు. కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోగా, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి, పోతినేని సుదర్శన్ ఎన్ని కల పరిశీలకులుగా వ్యవహరించారు. 41 మందితో కొత్త కమిటిని ఎన్నుకోగా 11 మంది జిల్లా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా తుమ్మల వీరారెడ్డిని, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నారి ఐలయ్య, డబ్బికార్ మల్లేష్, బండ శ్రీశైలం, పాలడుగు నాగార్జున, పాలడుగు ప్రభావతి, కందాల ప్రమీల, సీహెచ్ లక్ష్మీనారాయణ, సయ్యద్ హాషం,వీరేపల్లి వెంకటేశ్వర్లు కార్యదర్శివర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

జిల్లా కమిటీ సభ్యులు వీరే..

జిల్లా కమిటీ సభ్యులుగా పుచ్చకాయల నర్సిరెడ్డి, గంజి మురళీధర్, మల్ల మహేష్, వరలక్ష్మి, చౌగాని సీతారాములు, డి.సత్తయ్య నన్నూరి వెంకట రమణారెడ్డి, జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, పెంజర్ల సైదులు, రాచకొండ వెంకన్న, బొజ్జ చిన్న వెంకులు, చలకాని మల్లయ్య, రొండి శ్రీనివాస్, పాదూరు శశిధర్ రెడ్డి, రెవిడాల పరశురాములు, రవి నాయక్, వినోద్ నాయక్, అయూబ్, కొండేటి శ్రీను, కంబాలపల్లి ఆనంద్, నాంపల్లి చంద్రమౌళి, ఉడుగండ్ల రాములు, కర్నాటి మల్లేశం, కొండా అనురాధ, ఎండి సలీం, జిట్ట సరోజ, రాగిరెడ్డి మంగారెడ్డి కొంరెడ్డి నాగిరెడ్డి, చింతపల్లి బయన్నను ఏకగ్రీవంగా 30 మందిని ఎన్నుకున్నారు.

సీపీఎం 8వ జిల్లా కార్యదర్శిగా వీరారెడ్డి



సూర్యాపేట జిల్లా ఆత్మకూర్.ఎస్ మండలం తుమ్మపురం గ్రామానికి చెందిన తుమ్మల వీరారెడ్డి జిల్లా 8వ జిల్లా కార్యదర్శి ఎన్నిక య్యారు. సీపీఎం నల్లగొండ జిల్లా కమిటీ ఏర్పడిన 1963 నాటి నుంచి 7గురు జిల్లా కార్యదర్శులుగా ఎన్నిక కాగా 8వ జిల్లా కార్య దర్శిగా వీరారెడ్డి ఎన్నికయ్యారు. వీరారెడ్డి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శిగా, డీవైఎఫ్ఐ జిల్లా రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. 1997లో సీపీఎం నల్లగొండ జిల్లా కమిటీ సభ్యులుగా, సీఐటీయూ జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కమిటీ సభ్యుడిగా కూడా బాధ్యతలు చేపట్టారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

సీఎం పర్యటనకు ఏర్పాట్లు ముమ్మరం

(5వ పేజీ తరువాయి)

హైదరాబాద్ నుంచి వచ్చే సీఎం కార్యక్రమాల అనంతరం తిరిగి హెలికాప్టర్‌లలో హైదరాబాద్ బయలుదేరి వెళతారు.

సీఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షిస్తోన్న కలెక్టర్

సీఎం పర్యటన నేపథ్యంలో కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి నేతృత్వంలో అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. సీఎం పర్యటన నేపథ్యంలో ఆయా కార్యక్రమాల వద్ద ఎలాంటి పటిష్ట బందోబస్తుకు తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం కలెక్టర్, సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. అదేవిధంగా బ్రాహ్మణ వెల్లంలను సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. యాదాద్రి పవర్‌ప్లాంట్‌ని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సందర్శించి సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. సీఎం పర్యటన ఆసాంతం విజయవంతంగా ముగిసేలా సన్నాహాలు చేస్తున్నారు.

ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు.. జాతికి అంకితం

ఈ నెల ఏడోతేదీన జిల్లా పర్యటనకు వస్తోన్న సీఎం రేవంత్‌రెడ్డి నల్లగొండ జిల్లాలో ప్రతిష్టాత్మకంగా భావిస్తోన్న బ్రాహ్మణవెల్లంల-ఉదయసముద్రం ఎత్తిపోతల పథకాన్ని జాతికి అంకితం చేయనున్నారు. ఈ పథకం కింద తొలిదశలో 50వేల ఎకరాలకు నీరిచ్చే పనులు పూర్తయ్యాయి. రిజర్వాయర్ ప్రారంభించడంతోపాటు, రిజర్వాయర్ నుంచి కాల్వలకు నీటిని సీఎం విడుదల చేయనున్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వద్ద పట్టుబట్టి మంజూరు చేయించుకున్న ఈ పథకం ఎట్టకేలకు 18ఏళ్ల తర్వాత మళ్లీ వెంకటరెడ్డి మంత్రి అయ్యాకే పనులు పూర్తవడంతో ఏడో తేదీన ప్రారంభోత్సవానికి సిద్ధమయింది. అదేవిధంగా నాలుగువేల మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యంతో 2015లో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌లో యూనిట్-2 ద్వారా 800 మెగావాట్ల విద్యుదుత్పత్తిని ఏడోతేదీన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి ప్రారంభించనున్నారు. విద్యుత్ వ్యయం ఎక్కువవుతున్న నేపథ్యంలో ఈ ప్రాజెక్టుని కొనసాగిస్తారా..? లేదా..? అనే సందేహాలు నెలకొన్నప్పటికీ ఇప్పటికే ప్రాజెక్టుపై భారీగా వ్యయం చేయడంతో ప్రాజెక్టును కొనసాగించడానికే నిర్ణయించిన ప్రభుత్వం ఆ మేరకు పనులను వేగిరం చేయించింది. వీటితోపాటు నల్లగొండలో నిర్మాణం పూర్తయిన మెడికల్ కళాశాల భవనాలను సీఎం ప్రారంభించనున్నారు. అక్కడే నూతనంగా నిర్మించతలపెట్టిన నర్సింగ్ కళాశాల భవనానికి సీఎం శంకుస్థాపన చేస్తారు. వీటితోపాటు స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రానికి, ఇతర మునిసిపల్ పనులకు అంకురార్పణ చేయనున్నారు.

విద్యావ్యవస్థకు మూలస్తంభాలు

బీఈడీ కళాశాలలు

- ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్

క్యాంపస్ సమాచారం

నల్లగొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులను తయారు చేసే బీఈడీ కళాశాలలు విద్యావ్యవస్థకు మూలస్తంభాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్, ప్రొఫెసర్ అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా బీఈడీ, ఎంఈడీ, బీపీఈడీ, డీఈడీ స్పెషల్, ఎడ్యుకేషన్ కళాశాలల యజమాన్యాలు, ప్రిన్సిపాల్స్‌తో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ శిక్షణ విద్యావ్యవస్థలను పటిష్టపర్చాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు, ఎన్సీటీఈ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. కార్యక్రమంలో అకడమీ అడిషనల్ డైరెక్టర్ వై. ప్రశాంతి, ఓఎస్‌డీ కొప్పుల అంజిరెడ్డి, అడిట్ సెల్ డిప్యూటీ డైరెక్టర్ డా.సురేష్, డా.జయంతి, అమరేందర్, వివిధ కళాశాలల యజమాన్యాలు, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

పిట్టగోడ.. ఓ చెలికాడు



- సరదా కాలక్షేపానికి అడ్రస్‌గా ఎన్జీకళాశాల గోడ
- ఉదయం, సాయంత్రం వేళ కాలక్షేపాలకు అడ్డా
- కష్టసుఖాలకు వేదిక అవుతున్న

రామగిరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వారిలో కొందరు మలిసంధ్యకు చేరువైన పెద్దలు, జీవితాలను కాచి వడపోసిన అనుభవజ్ఞులు.. వివిధ రంగాల్లో నిష్ణాతులు, సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుటుంబ వ్యవహారాల్లో తలపండిన వారు. పదవీ విరమణ దగ్గరైన వారు మరికొందరు. ఇలా వారంతా ప్రతి రోజూ ఒకచోట చేరి గ్రామపంచాయతీ నుంచి ప్రపంచ రాజకీయాల వరకు చర్చిస్తారు. విదేశాల్లోని తమ పిల్లల గురించి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తుంటారు. వర్తమాన అంశాలపై మంచి చెడులను విశ్లేషించడంతో పాటు మలిదశలో ఎదురయ్యే ఆరోగ్య సమస్యలకు పరిష్కారం వెతుకుతారు. రోజూ వచ్చే తమ సావాసగాళ్లు ఒక్కరోజు కనిపించకపోతే తల్లడిల్లుతుంటారు.. ఇక్కడ చేరిన పెద్దల అనుభవాలను తెలుసుకోవడానికి పిల్లలు కూడా వారి వద్దకు చేరి చర్చల్లో పాలుపంచుకుంటున్నారు. వివిధ అంశాలపై వారి సూచనలు, సలహాలు తీసుకుంటుంటారు. ఇదంతా నల్లగొండ పట్టణంలోని ఎన్‌జి కళాశాల మైదానంలో ఉన్న గోడ మీద ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం కనిపించే అద్భుత దృశ్యాలు. గడిచిన ముప్పై, నలభై ఏళ్లుగా పెద్దలు ఈ మైదానం గోడపై కూర్చుని జరిపే చర్చలు ఆసక్తిగా ఉంటాయి. వీరి మాటలు వినేందుకు పలువురు ఇక్కడికి రోజూ వస్తారంటే అతిశయోక్తి కాదు. మూడు అడుగుల గోడ అనేక ముచ్చట్లకు వేదిక అయ్యింది. గజిబిజిగా మారిన ఈ ఆధునిక జీవనంలో వృద్ధులు, శారీరక, మానసిక సమస్యలు ఎదుర్కొంటూ, పలకరించే వారు లేక మనోవేదనకు గురవుతున్నవారికి ఈ పిట్ట గోడ కబుర్లకు నిలయం. నల్లగొండ జిల్లా కేంద్రంలో ఎన్జీ కళాశాల ప్రవేశ రోడ్డు వెంట ఉన్న ఒక చిన్న గోడ. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆత్మీయ పలకరింపులతో కనిపిస్తూ వృద్ధుల సెంటర్ పాయింట్‌గా నిలిచింది. నిత్యం ఇక్కడకు వచ్చేవారు కిలకిల నవ్వులతో హాయిగా, ప్రశాంతంగా గడుపుతున్నారు. ఎంత ముఖ్యమైన పనైనా వదులుకుంటాం కానీ రోజూ ఇక్కడికి వచ్చి మాట్లాడుకోవడం మాత్రం మానుకోం అంటున్నారంటే ఈ గోడతో వారికి ఉన్న అనుబంధం ఉందో అర్థమవుతోంది. ఈ విధంగా పిట్టగోడ వారికి స్నేహితుడిలా మారింది.


● ఇక్కడ పుట్టినిల్లు వలె ఉంటుంది



ఇక్కడికి ఎవరెవరో వస్తుంటారు. ఇక్కడికి వచ్చినవారందరం దోస్తులం అవుతాం. ఎవరి పుట్టినిల్లు ఎక్కడ ఉంటుందో కాని ఇక్కడికి వచ్చినవారందరికీ మాత్రం వారి పుట్టినిల్లులా ఉంటుంది. ఇక్కడ మంచి చెడు, ఆరోగ్యం అన్ని విషయాలపై మాట్లాడుకుంటాం. ఇంట్లో గొడవలు అయినా ఇక్కడికి వచ్చి కాసేపు ముచ్చటించుకుంటే అవన్నీ మరిచిపోవాల్సిందే. మనుసుకు కూడా ఎంతో హాయిగా ఉంటుంది.

కందుల సత్యం , రిటైర్డ్ లైన్‌మన్

● ఇదొక నవ్వు నవ్వించు వేదిక



ఇంట్లో ఎన్ని బాధలున్నా సరే ఇక్కడికొస్తే అన్ని మర్చిపోవాల్సిందే. ఈ గోడ మాకు నవ్వు నవ్వించు లాంటి వేదికవంటిది. కష్టసుఖాలన్నీ ఇక్కడే పంచుకుంటాం. పిల్లల చదువులు, వారి భవిష్యత్ విషయాలు వంటివి ఒక్కరికి ఒకరం మాట్లాడుకుంటాం. కుటుంబంలో ఒడిదుడుకులు కూడా ఇక్కడే చెప్పుకుంటాం.

శ్రీను రెడ్డి, రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి

● ఈ వాతావరణం ఎంతో ఆరోగ్యాన్నిస్తుంది



ఉరుకుల పరుగుల ఈ జీవితంలో కాసేపు ఇక్కడికి వస్తే ఇక్కడున్న ఈ ఆహ్లాదకరమైన వాతావరణంలో మనసుకు ఎంతో హాయిగా ఉంటుంది. ఒకరి ముచ్చట్లు ఒక్కరి చెప్పుకోవడంతో మనసుల్లో ఉండే బాధలన్నీ తొలిగిపోయినట్లే అనిపిస్తది. రోగాలు ఉన్నా సరే మేం మాట్లాడుకునే మాటాలకు అవి నయమైనట్లుగా అనిపిస్తది. సర్వరోగ నివారిణిగా ఈ గోడ అని అనుకుంటాం.

ఉపేందర్, లైన్‌ఇన్‌స్పెక్టర్

● మంచుదుప్పట్లో మార్నింగ్ వాక్



సూర్యాపేట జిల్లా కేంద్రంలో బుధవారం తెల్లవారుజామున దట్టమైన మంచు కురిసింది. సూర్యాపేట శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో పట్టణవాసులు మంచు కురుస్తున్నా మార్నింగ్ వాక్ చేశారు. ఉదయం ఐదు గంటల నుంచి కురిసిన మంచు 9 గంటల వరకు ఉంది. రహదారులపై ఏడు గంటల వరకు వాహనాల లైట్ల వెలుగులో ప్రయాణించారు.

- భానుపురి

చనిపోతూ నలుగురికి పునర్జన్మ

- మహిళకు బ్రెయిన్ డెడ్
- నలుగురికి అవయవ దానం



బైరు అంజమ్మ (ఫైల్)

చౌటుప్పల్ టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ కుటుంబసభ్యుల ఔదార్యం నలుగురికి కొత్త జీవితం ఇచ్చింది. బ్రెయిన్ డెడ్ అయిన మహిళ అవయవాలు దానం చేసి ఆదర్శంగా నిలిచారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మునిసిపాలిటీలోని తంగడపల్లికి చెందిన బైరు అంజమ్మ (68) గత నెల 27న అకస్మాత్తుగా ఇంట్లో పడిపోయి గాయపడింది. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న అంజమ్మకు బ్రెయిన్ డెడ్ అయినట్టుగా ఈ నెల 3వ తేదీన వైద్యులు నిర్ధారించారు. అవయవాలను దానం చేసేందుకు అంజమ్మ కుమారులు సుదర్శన్, కిరణ్ అంగీకరించారు. దీంతో ఆసుపత్రి వైద్యులు జీవన్‌దాన్ ట్రస్ట్‌కు సమాచారం ఇవ్వటంతో వారు అంజమ్మ అవయవాలను సేకరించారు. అంజమ్మ నుంచి సేకరించిన అవయవాలు (కళ్లు, కాలేయం, గుండె, కిడ్నీ) మరో నలుగురికి ప్రాణం పోయనున్నాయి. కాగా, అంజమ్మ అంత్యక్రియలు బుధవారం తంగడపల్లిలో నిర్వహించారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక

మిర్యాలగూడ టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రస్థాయి అండర్-17 క్రికెట్ పోటీలకు నల్లగొండ జిల్లా మిర్యాలగూడ లోటస్ స్కూల్ విద్యార్థినులు ఎంపికైనట్లు పాఠశాల చైర్మన్ బీ వరప్రసాద్ తెలిపారు. బుధవారం పాఠశాలలో మాట్లాడుతూ పాఠశాలకు చెందిన బృహతి, యోక్ష రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక కావడం ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో యాదయ్య, వెంకన్న పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

పత్తి కొనుగోళ్లు చేపట్టాలి



నీలంనగర్ వద్ద రాస్తారోకో చేస్తున్న పత్తి రైతులు

పెద్దఅడిశర్లపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోళ్లు చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం నీలంనగర్ వద్ద కోదాడ- జడ్చర్లపై జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం రాస్తారోకో చేశారు. తిరుమల కాటన్ మిల్లు, సాంబశివ కాటన్‌మిల్లుల్లో నిల్వలు పేరుకుపోవడంతో అక్కడ ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రంలో పత్తి కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేశారు. దీంతో రైతులు సుమారు గంట సేపు రైతులు రాస్తారోకో చేశారు. ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రైతులు, సీసీఐ నిర్వాహకులతో మాట్లాడారు. నిల్వలు ఖాళీ అయిన వెంటనే కొనుగోలు చేస్తామని హామీఇవ్వడంతో ఆందోళన విరమించారు.

తాత్కాలికంగా పత్తి కొనుగోళ్ల నిలిపివేత

కొండమల్లేపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ వ్యవసాయ మార్కెట్ పరిధిలోని ఐదు పత్తి మిల్లుల్లో నిల్వలు పేరుకుపోయినందున గురువారం నుంచి కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు సీసీఐ బయ్యర్ శ్రీనివాస్‌రావు, మార్కెట్ కార్యదర్శి కిరన్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి కొనుగోళ్ల జరిపే తేదీలను ప్రకటిస్తామని, రైతులు సహకరించాలని కోరారు.

బెస్ట్ పారా స్పోర్ట్స్ వీల్ చైర్ క్రికెటర్‌గా సురేష్



సురేష్‌ను సన్మానిస్తున్న మంత్రి సీతక్క, కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య

తిరుమలగిరి(సాగర్), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బెస్ట్ పారా స్పోర్ట్స్ వీల్ చైర్ క్రికెట్‌గా నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలం రంగుండ్ల తండాకు చెందిన దివ్యాంగ క్రీడాకారుడు ధరావత్ సురేష్ అవార్డు అందుకున్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి సీతక్క, దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, ప్రిన్సిపల్ సెక్రటరీ అనితారామచంద్రన్, కమిషనర్ శైలజలు అవార్డు అందజేసి సన్మానించారు. వీల్‌చైర్ క్రికెట్, బాస్కెట్‌బాల్ పోటీల్లో జాతీయస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న సురేష్‌ను గుర్తించి సత్కారం పొందడంతో గ్రామస్థులు ఆయన్ను అభినందించారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక


డిండి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల క్రీడా అకాడమీ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శిరీష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7 నుంచి 11 వరకు భువనేశ్వర్‌లో జరిగే 39వ జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థినులు ప్రవళిక, మల్లిక, ఎం.శృతి, అఖిల, నిఖిత, పూజిత పాల్గొంటారని పేర్కొన్నారు.



జాతీయ స్థాయి అథ్లెటిక్స్ ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ శిరీష

భయపెట్టిన భూ ప్రకంపనలు

» నాడు కృష్ణాపరివాహకం.. నేడు గోదావరి పరివాహకంలో అలజడి » కొన్ని సెకన్లపాటు కంపించిన భూమి » ఆందోళన చెందిన ప్రజలు



హుజూర్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో భూప్రకంపనలతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. గతంలో కృష్ణాపరివాహక ప్రాంతంలో బుధవారం గోదావరి పరివాహకంలో అలజడి నెలకొంది. ఏమి జరుగుతుందోనని కొన్ని సెకండ్లపాటు ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ములుగు జిల్లా పరిధిలోని మేడారం ప్రాంతంలో వచ్చిన భూ ప్రకంపనలు ఒక్కసారిగా ప్రజలను ఉలికిపాటుకు గురిచేసింది. భూకంపం తీవ్రత రిక్టర్ స్కేల్ 5.3గా నమోదైంది. 40 కిలోమీటర్ల లోతులో సుమారు 300 కిలోమీటర్ల దూరంలో భూ ప్రకంపనలు సృష్టించినట్లు ఎన్‌జీఆర్‌ఐ సంస్థ శాస్త్రవేత్తలు ప్రకటించారు. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల పరిధిలోని హైదరాబాద్ మొదలు విజయవాడ వరకు, అదే విధంగా మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్‌లో సైతం భూకంపం వ్యాపించినట్లు శాస్త్రవేత్తలు వెల్లడించడం దాని తీవ్రతను తెలియజేసింది. బుధవారం ఉదయం 7:25 నిమిషాలకు భూమి కొన్ని సెకన్ల పాటు కంపించింది. దీంతో ప్రజలు ఒక్కసారిగా ఇంట్లో నుంచి బయటకు పరుగులు తీశారు. మేడలు, మిద్దెలు, అపార్టుమెంట్‌లలోని ప్రజలు ఆందోళన చెందారు. భూమి కంపించిన వెంటనే ప్రజలు గుర్తించారు.

పొరలోని పగుళ్ల కదలికలతో...

భూ ప్రకంపనలు రావడానికి రాతి పొరలోని పగుళ్ల కదలికల కారణమని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. భూమి లోపల 40 కిలోమీటర్ల లోతులో భూకంపం ప్రకంపన జరిగినట్లు తెలుస్తోందని పేర్కొంటున్నారు. ఈ తీవ్రతతో ప్రజలకు ఎలాంటి ఆస్తి నష్టం జరగనప్పటికీ తరుచూ భూకంపాలు రావడం ఆందోళన కలిగిస్తోంది. 2021 జనవరిలో సూర్యాపేట జిల్లా కృష్ణాపరివాహక ప్రాంతంలోని చింతలపాలెం(మల్లారెడ్డి గూడెం) మండలంలో ప్రాంతంలో అనేక ఇళ్లకు పగుళ్లు ఏర్పడ్డాయి. గుంటూరు జిల్లాలో భూ ప్రకంపనలతో అప్పుడు హుజూర్‌నగర్ నియోజకవర్గం మొత్తం భూకంపం వచ్చింది. పాత భవనాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ నివాసం ఉండవద్దని అప్పుడు అధికారులు హెచ్చరించారు. గుంటూరు జిల్లాకు అనుకుని ఉన్న సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గ ప్రజలను రెవెన్యూ అధికారులు అప్రమత్తం చేశారు. భూకంపం విషయంలో రెవెన్యూ అధికారులు డప్పు చాటింపు కూడా వేయించారు. భూకంపంతో దెబ్బతిన్న ఇళ్లకు ప్రభుత్వం ఎలాంటి సహకారం అందించలేదు.

సిమెంట్ పరిశ్రమలు ఉన్న ప్రాంతాల్లో ..

నదిపరివాహక ప్రాంతాల్లోని భూమి పొరల్లో ఉన్న రాళ్ల మధ్య ఉన్న కదలికలతో భూకంపం వచ్చినట్లు శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. సిమెంట్ పరిశ్రమలు ఉన్న ప్రాంతాల్లో బ్లాస్టింగ్ చేసి రాళ్లను తొలగిస్తే భూ కంపాలు వచ్చే అవకాశముందని పేర్కొంటున్నారు. పరిశ్రమల యాజమాన్యాలు భూమి పొరల్లోని రాళ్లను తొలగిస్తే ఇలాంటి సంఘటనలు జరుగుతాయని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు కూడా భూకంపాలు వచ్చే అవకాశముందని పేర్కొంటున్నారు.

భూకంపం వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాలి

భూకంపం వచ్చినప్పుడు ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. భూ పొరల్లో ఒత్తిడి కలిగినప్పుడు భూప్రకంపనలు సంభవిస్తాయి. ఉభయ రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్‌లో కూడా ప్రకంపనలు వచ్చాయి. ఉదయం సుమారు 7:30 గంటల సమయంలో కొన్ని సెకన్ల పాటు భూమి కనిపించింది.ఉభయ రాష్ట్రాల్లో ఎక్కడా కూడా ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదు. భూకంపంను ముందుగా పసిగట్టే అవకాశం లేదు. సుమారు 40 కిలోమీటర్ల లోతులో 300 కిలోమీటర్ల మేరకు భూకంపం వ్యాప్తి చెందినట్లు గుర్తించారు. రిక్టర్ స్కేల్ 5.3గా నమోదు అయింది. కాగా ఆరు శాతం వస్తే తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశాలు ఉన్నాయి. భూ ప్రకంపనలు వచ్చినప్పుడు ప్రజలు విశాలమైన ప్రదేశాలకు వెళ్లాలి. 2015, 2016, 2020, 2021లో ఉభయ రాష్ట్రాల్లో భూ ప్రకంపనలు వచ్చాయి.

● ఎం.శేఖర్, ఎన్‌జీఆర్‌ఐ శాస్త్రవేత్త హైదరాబాద్.

ముఖ్యంగా దేశంలోని అనేక ప్రాంతాల్లో నది పరివాహక ప్రాంతాల్లోనే అధికంగా సంఘటనలు జరుగుతాయని వెల్లడిస్తున్నారు. భూమి పొరల్లోని కదలికలు వచ్చిన సందర్భంలో ఏర్పడే భూకంపంతో ప్రజలు ఆందోళన చెందుతారని తెలిపారు.

భూమి ఒత్తిడికి గురైనప్పుడు

దాని తీవ్రతను బట్టి రిక్టర్ స్కేల్‌పై నమోదు శాతం చూపించే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు వెల్లడించారు. తెలుగు రాష్ట్రాల్లో కట్టడాలు, పటిష్టంగా ఉన్నందున రిక్టర్ స్కేల్‌పై 6 శాతంలోపు భూకంపం వచ్చినా ఎలాంటి నష్టం జరగదని వెల్లడిస్తున్నారు.భూమిలోపల ఏర్పడే పొరల మధ్య కదలికలతో రిక్టర్ స్కేల్ 6 దాటితే భూమి లోపల ఎక్కువ లోతులో భూకంపం వ్యాపిస్తే పెద్ద మొత్తంలో నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయని వెల్లడిస్తున్నారు.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	586.80
టీఎంసీలు	304.4680
ఎడమకాల్వకు నీటి విడుదల	4,814
కుడికాల్వకు	8,067
విద్యుత్ కేంద్రం ద్వారా	12,261
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1800 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	35,315
అవుట్‌ఫ్లో	26,942క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	45.46 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	4549 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	2000 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	644.68 అడుగులు
టీఎంసీలు	4.38
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	215.84 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	215.84 క్యూసెక్కులు

ఉలిక్కిపడిన ఉమ్మడి జిల్లా

నల్లగొండ, ఆత్మకూర్(ఎస్), గుండాల, ఆత్మకూరు(ఎం), కోదాడ రూరల్, అనంతగిరి, నాగారం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బుధవారం స్వల్ప ప్రకంపనలతో ప్రజలు భయాం దోళనకు గురయ్యారు. సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో 15 సెకన్ల పాటు భూమి కంపించడంతో పట్టణవాసులు ఆందోళనకు గురయ్యారు. నల్లగొండ పట్టణంలో చంద్రగిరి విలాస్ ప్రాంతంలో ఉదయం 7.36 నిమిషాలకు భూమి స్వల్పంగా కంపిం చినట్లు స్థానికులు తెలిపారు. నూతనకల్‌లో భూమి స్వల్పంగా కంపించింది. యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలంలోని పాతర్లపహాడ్, మక్తాకొత్తగూడెం గ్రామాల్లో బుధవారం ఉదయం భూమి స్వల్పంగా కంపించి రేకుల ఇళ్ల నుంచి శబ్దాలు రావడంతో భయాందోళనతో ప్రజలు ఒక్కసారిగా బయటికి వచ్చారు. ఇళ్లలోని మంచాలు కదిలినట్లు తెలిపారు. గుండాల మండలంలోని గుండాల, సీతారాం పురం, మాసాన్‌పల్లి, బ్రాహ్మణపల్లి తదితర గ్రామాల్లో బుధవారం ఉదయం 7:25 గంటల సమయంలో రెండు సెకండ్ల పాటు స్వల్పంగా భూమి కంపించడంతో ప్రజలు భయాందోలనకు గురయ్యారు. భూమి కంపించినప్పుడు ఇంట్లో ఉన్న మంచాలు, ఫ్యాన్లు తదతర వస్తువులు కదలడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఏమి జరిగిందోనని ఇంట్లో ఉన్న వారు బయటకు పరుగులు తీశారు. ఆత్మకూరు(ఎం) మండలంలో బుధవారం ఉదయం భూమి స్వల్పంగా కంపించింది. మండలకేంద్రంతో పాటు కూరెళ్ల గ్రామంలో సైతం భూ ప్రకంపనలు వచ్చినట్లు స్థానికులు తెలిపారు. మండలంలో రెండు సెకన్ల పాటు అతి స్వల్పంగా భూమి కంపించగా మండల కేంద్రంలో ఎల్మినేటి లక్ష్మి ఇంట్లో గోడలకు సన్నటి పగుళ్లు వచ్చాయి. కుర్చీలో కూర్చొని ఉండగా ఒక్కసారిగా ముందుకు తోసినట్లు అయిందని ఆమె తెలిపారు. రచ్చ జ్ఞానేశ్వర్ టీ తాగుండగా కప్పు కదిలి టీ వలికిందని తెలిపారు. కూరెళ్లలో భూ ప్రకంపనలు అని తెలియగానే ప్రజలు ఇళ్ల నుంచి బయటికి వచ్చారు. హుజూర్‌నగర్‌లలో మూడు సెకన్ల పాటు భూమి కంపించింది. తిరుమలగిరి, మేళ్లచెర్వు, నాగారం, కోదాడ, అనంతగిరి మండలాల్లో బుధవారం ఉదయం భూమి స్వల్పంగా కంపించడంతో ప్రజలు భయంతో పరుగులు తీశారు. నల్లబండగూడెం, రెడ్లకుంట, కూచిపూడి, తొగర్రాయి, కాపుగల్లు, తమ్మర, అనంతగిరి, శాంతినగర్, అమీనాబాద్, ఖానాపురం, మొగలాయికోట, సింగారం గ్రామాల్లో స్వల్పంగా భూమి కంపించిందని ప్రజలు తెలిపారు. రెండు సెకండ్ల పాటు భూమి కంపించడంతో ఇంట్లోని వస్తువులు కిందపడిపోయాయని, మంచాలు జరిగిపోయాయని స్థానికులు తెలిపారు.

ట్రాక్టర్, కారు ఢీ.. ఒకరు మృతి



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

మిర్యాలగూడ అర్బన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్‌ను కారు ఢీకొన్న సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం గూడూరు వద్ద బుధవారం జరిగింది. రూరల్ ఎస్ఐ లోకేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన షేక్ నజీర్(42) తన మిత్రుడు వీరసీతారామరాజుతో కలిసి కారులో హైదరాబాద్ నుంచి గుంటూరుకు బయలుదేరాడు. మార్గం మధ్యలో గూడూరు గ్రామం వద్దకు చేరుకోగా ముందుగా వెళ్తున్న టీఎస్ 05ఈఎఫ్5370 నెంబర్‌గల ట్రాక్టర్ రోడ్డు మధ్యనుంచి ఒకేసారి ఎడమవైపునకు మళ్లించాడు. దీంతో ట్రాక్టర్ వెనుక నుంచి వస్తున్న కారు అదుపుతప్పి ట్రాక్టర్ ట్రాలీ వెనకభాగాన్ని ఢీ కొట్టింది. దీంతో కారు డ్రైవర్ పక్కసీట్లో కూర్చున్న షేక్ నజీర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సలహా మేరకు నల్లగొండ జిల్లాకేంద్ర ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు ఎస్ఐ తెలిపారు. నజీర్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తండ్రి నాగులుమీరా ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ ధీరావత్ సురేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంట్లోకి చొరబడి గొలుసు లాక్కెళ్లి..

మహిళపై దాడి చేసి బంగారు గొలుసు అపహరించిన దుండగులు

చిట్యాల, డిసెంబరు 4, (ఆంధ్రజ్యోతి): ఇంట్లోకి చొరబడిన దొంగలు మహిళ మెడలో ఉన్న పుస్తెలతాడు లాక్కెళ్లారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చిట్యాలలో బుధవారం పట్టపగలే జరిగింది. ఎస్ఐ ధర్మా, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఉరుమడ్ల రోడ్డులో చేపూరి ప్రేమలత, సత్తిరెడ్డి దంపతులు నివాసముంటున్నారు. మధ్యాహ్నం భర్త బయటికి వెళ్లడంతో ఇంట్లో ప్రేమలత దుస్తులు సర్దుకుంటుంది. ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి మేము నక్సలైట్లమనీ.. మీ ఇంట్లో ఉన్న మొత్తం బంగారం, డబ్బులు ఇవ్వాలని బెదిరించారు. ఇంట్లో ఏమీ లేదు.. మా ఆయన ఇంట్లోనే ఉన్నాడని ప్రేమలత చెప్పింది. దీంతో దుండగులు ఆమెపై దాడి చేసి మెడలో ఉన్న ఐదు తులాల పుస్తెలతాడు లాక్కెళ్లారు. ప్రేమలత వెంటనే భర్తకు ఫోన్ చేసి విషయం చెప్పింది. సత్తిరెడ్డి వెంటనే ఫోన్‌లో పోలీసులకు సమాచారమిచ్చాడు. అప్రమత్తమైన పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించారు. వారి సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా పట్టుకున్నట్లు తెలిసింది. నిందితులు చిట్యాల మండలంలోని వనిపాకల గ్రామానికి చెందినవారిగా గుర్తించి వారిని విచారిస్తున్నట్లు సమాచారం.

బంగారం దొంగిలించిన ఏడుగురి అరెస్ట్

చిలుకూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బంగారం దొంగతనం చేసిన ఏడుగురు దొంగలను సూర్యాపేట జిల్లా చిలుకూరు పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. బర్మావత్ వసంత కుటుంబసభ్యులతో కలిసి నల్లగొండ నుంచి అక్టోబరు 10వ తేదీన రాత్రి చిలుకూరు మండలంలోని జానకినగర్ గ్రామానికి ఆర్టీసీ బస్సులో వచ్చింది. ఈ క్రమంలో నల్లగొండ నుంచి వస్తున్న బస్సు చిలుకూరు మండలం సీతారాంపురం స్టేజీ వద్దకు వచ్చిన తరువాత బ్యాగులోంచి ఐదు తులాల బంగారం దొంగతనానికి గురైందని గుర్తించింది. బాధితురాలు అదేరోజు చిలుకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బుధవారం మండల పరిధిలోని కవిత కళాశాల వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా, మిర్యాలగూడెం నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సులో అనుమానాస్పదంగా ఉన్న ఏడుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం అక్టోబరు 10వ తేదీన రాత్రి దొంగతనం చేసినట్లుగా ఒప్పుకున్నారని, వారి వద్ద నుంచి బంగారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రాంబాబు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలానికి చెందిన తమ్మిశెట్టి వాణి, గుంజ గిడ్డన్న, వేముల జ్యోతి, వేముల బాలవెంకటస్వామి, వెల్ల చిన్నా, వీరగండ్ల సరోజనమ్మతో పాటు మైనర్ బాలుడు ఉన్నాడని తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్సపొందుతూ మహిళ మృతి



హుజూర్‌నగర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయ పడిన మహిళ చికిత్సపొందుతూ బుధవారం మృతిచెందింది. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలంలోని శ్రీనివాసపురం గ్రామానికి చెందిన జింకల లింగమ్మ(53) ఈ నెల 2న హుజూర్‌నగర్‌కు కూలి పని నిమిత్తం వచ్చింది. సాయంత్రం ఇంటికి వెళ్లేందుకు అదే గ్రామానికి చెందిన పారుపల్లి రమేష్ బైక్‌పై ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యంలో రమేష్ అతివేగంగా బైక్ నడపటంతో లింగమ్మ కిందపడడంతో తలకు తీవ్ర గాయమైంది. ఆమెను పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్సపొందుతూ బ్రెయిన్ డెడ్ కావడంతో బుధవారం మధ్యాహ్నం మృతిచెందింది. ఆమెకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భర్త గతంలోనే మృతిచెందాడు. చిన్న కుమార్తె తిరుపతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వైభవంగా సుదర్శన నారసింహ హోమం





సుదర్శన నారసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు, ఊరేగింపుగా స్వామిఅమ్మవార్లను తరలిస్తున్న జిల్లా కలెక్టర్ హనుమంతరావు, ఈవో భాస్కర్‌రావు తదితరులు

భువనగిరి అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శ్రేయస్సు, లోక కల్యాణార్థం యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో బుధవారం సుదర్శన నారసింహ హోమం వైభవంగా నిర్వహించారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా ఉదయం 10నుంచి 11గంటల వరకు వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ హోమం చేపట్టారు. జిల్లా కలెక్టర్ హనుమంతరావు హోమంలో పాల్గొని పూజలు చేశారు. ముందుగా స్వామివారిని ఉత్తర ద్వారం ఎదురుగా తిరువీధిలో భక్తులు సందర్శించేలా ప్రత్యేక వేదికను ఏర్పాటు చేశారు. అగ్ని ప్రతిష్ఠ చేసి మూల మంత్ర హోమం, సుదర్శన శతకం, మాల మంత్ర హోమం నిర్వహించి పూర్ణాహుతి, ఆశీర్వచనంతో సుదర్శన హోమం పరిపూర్ణమైంది. కార్యక్రమంలో ఈవో ఏ.భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, డీఈవో దోర్బల భాస్కరశర్మ, అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

లక్ష్మీ నరసింహస్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్య పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను అభిషేకించి తులసీదళాలతో సహస్రనామార్చనలు చేశారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామిఅమ్మవార్లను అలకరించారు. ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలు ఆగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. సాయంత్రం ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అలంకార వెండిజోడు సేవలు, సహస్రనామార్చనలు చేశారు. పాతగుట్ట ఆలయంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిత్య పూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో శ్రీపర్వత వర్ధిని రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.16,41,245 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కాగా, దేవాదాయ కమిషనర్ శ్రీధర్ కుటుంబ సమేతంగా గురువారం యాదగిరిగుట్టకు రానున్నారు. వేకువజామున అభిషేక పూజల్లో పాల్గొని తిరుగు ప్రయాణం కానున్నారు. కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తొలిసారి క్షేత్ర పర్యటనకు వస్తుండటంతో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

భూ సమస్య తీరలేదని సెల్ టవర్ ఎక్కి..

● క్రిమిసంహారక మందు డబ్బాతో మహిళ హల్‌చల్

శాలిగౌరారం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఓ మహిళ క్రిమిసంహార మందు డబ్బాతో సెల్ టవర్ ఎక్కి నిరసన వ్యక్తంచేసింది. బుధవారం నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండల కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం... శాలిగౌరారం మండలం నూలగడ్డకొత్తపల్లి గ్రామానికి చెందిన అన్నదమ్ములు సంకటి పోతయ్య, సంకటి సత్తయ్యల మధ్య కొంత కాలంగా భూ వివాదం నడుస్తోంది. అన్నదమ్ములు భూమి పంచుకోవడంతో పోతయ్య పొలానికి బాట ఉంది. సత్తయ్య పొలానికి బాట లేకుండటంతో తనకు కూడా బాట కావాలని పోతయ్య మీద ఒత్తిడి తెస్తున్నారు. ఈ వివాదంపై పోలీసుస్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. పెద్ద మనుషుల సమక్షంలో పలుమార్లు పంచాయితీ జరిగింది. పోతయ్య పొలం దున్నుండగా తనకు బాట ఇచ్చిన తర్వాతే పొలం దున్నుకోవాలని సత్తయ్య కుటుంబీకులు ఒత్తిడి తెస్తున్నారు. అయితే తాను బాట ఇచ్చే ప్రసక్తే లేదని పోతయ్య తేల్చిచెప్పారు.

స్టార్టర్ చోరీపై పరస్పరం ఫిర్యాదులు

తన పొలంలోని స్టార్టర్‌ను సత్తయ్యతో పాటు కుటుంబ సభ్యులు దొంగిలించినట్లు పోతయ్య మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన పొలంలోని స్టార్టర్లను పోతయ్య దొంగిలించినట్లు సత్తయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో పోతయ్య భార్య సత్తమ్మ మంగళవారం మధ్యాహ్నం శాలిగౌరారం మండల కేంద్రానికి చేరుకుని క్రిమిసంహారక మందు డబ్బాతో సెల్‌టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేసింది. తమ భూ సమస్యను పరిష్కరించడంలో పోలీసులు నిర్లక్ష్యం చేస్తున్నారని, క్రిమి సంహారక మందు తాగుతానని బెదిరించింది. సత్తమ్మ బంధువులు, కుమారులు అక్కడకు చేరుకుని తమకు అన్యాయం జరిగిందని, పోలీసులు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సత్తమ్మ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. చట్టపరంగా ఉంటే సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో సత్తమ్మ టవర్ దిగింది. ఈ విషయమై ఎస్ఐ సైదులు మాట్లాడుతూ కొంత కాలంగా పోతయ్య, సత్తయ్యల భూ వివాదం ఉందన్నారు. పోతయ్యకు బాట ఉందని, సత్తయ్యకు బాట లేదని వారు పంచుకునే క్రమంలోనే జరిగిందన్నారు. ఇదే విషయమై పలుమార్లు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారని, చట్టపరంగా ఉంటే కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని అన్నారు. ఈ విషయంపై తన నిర్లక్ష్యం ఏమీ లేదన్నారు.



సెల్ టవర్ ఎక్కిన సత్తమ్మ

రైస్ మిల్లులో తనిఖీలు



రైస్ మిల్లులో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

భూదాన్‌పోచంపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పట్టణ పరిధిలోని ముక్తాపూర్‌లోని లక్ష్మీనర్సింహ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లులో సివిల్ సప్లై అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. 2022-23 రబీ సీజన్‌కు సంబంధించిన ఈఎంఆర్ ధాన్యం ప్రభుత్వానికి అప్పగిం చడంలో బకాయిపడిన ఈ మేరకు యాజమాన్యం 2022-23 ఆర్థిక సంవత్సరం రబీసీజన్‌కు సంబంధించి సీఎంఆర్ ధాన్యం రూ.17.67కోట్ల మేరకు ప్రభుత్వంకు అప్పగించాల్సి ఉంది. ఇప్పటి వరకు ధాన్యం అప్పగించలేదని సివిల్ సప్లై శాఖ ఓఎస్‌డీ అంజయ్య తెలిపారు. ఇప్పటి వరకు ప్రభుత్వానికి అప్పగించాల్సిన ధాన్యం అప్పగించకుండా యాజమాన్యం నిర్లక్ష్యం చేశారని, ఈ విషయంపై ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని ఆయన తెలిపారు. ఆయన వెంట సివిల్ సప్లయ్ శాఖ డీటీ బాలమణి తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి చెక్‌పోస్టులో ఏసీబీ ఆకస్మిక తనిఖీలు

రూ.86,600 అదనపు నగదు స్వాధీనం

దామరచర్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వాడపల్లి వద్ద రాష్ట్ర సరిహద్దులోని ఆర్టీఏ చెక్ పోస్టులో ఏసీబీ అధికారులు రూ.86,600 అదనపు నగదు స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్ర వ్యాప్త తనిఖీల్లో భాగంగా బుధవారం తెల్లవారుజామున 3గంటల నుంచి 6.30గంటల వరకు ఏసీబీ సిబ్బంది తనిఖీలు చేశారు. ఆ సమయంలో ఆర్టీఏ అధికారి, ఇద్దరు అసిస్టెంట్లు విధుల్లో ఉన్నారు. చెక్‌పోస్టు మీదుగా వెళ్లే రాకపోకలు సాగించే వాహనాలకు సంబంధించిన బిల్లులు తనిఖీ, లోడ్ పర్మిట్ పత్రాలు తనిఖీచేసి అనుమతిస్తుంటారు. అనుమతి పత్రాలు లేని వాహనాలను కొంత జరిమానా విధించి అనుమతి మంజూరుచేస్తారు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున మూడుగంటలకు పైగా ఏసీబీ సిబ్బంది కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో లెక్కకు మించి ఉన్న రూ.86,600 నగదును అధికారులు సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో సుమారు పది మంది వరకు ఏసీబీ అధికారులు పాల్గొన్నారు. అదనంగా పట్టుబడిన నగదును సీజ్ చేసి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్

పాలకవీడు, డిసెంబరు 4: (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా పాలకవీడు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ నరేష్‌ను జిల్లా ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్ సస్పెండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పాలకవీడు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నరేష్ కోదాడలో పట్టణంలో నివసిస్తున్నాడు. అతను నివసిస్తున్న ప్రదేశంలోనే అనంతగిరి పోలీస్‌స్టేషన్‌లో రైటర్‌గా విధులు నిర్వహిసున్న వీరబాబు కూడా నివాసముంటున్నాడు. వీరి ఇద్దరి మధ్య కొంతకాలంగా వ్యక్తిగత గొడవలు ఉన్నాయి. వారం క్రితం అనంతగిరిలో డ్యూటీ ముగించుకొని ఇంటికి వస్తున్న వీరబాబుపై నరేష్ గొడవపడి దాడి చేశాడు. ఈ విషయంపై వీరబాబు అదే రోజు కోదాడ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఉన్నతాధికారుల విచారణ చేపట్టి క్రమశిక్షణ చర్యల్లో భాగంగా నరేష్‌ను సస్పెండ్ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.

బొల్లంపల్లి వీవోఏపై వేటు

అర్వపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు చేసి ట్యాబ్ ఎంట్రీ చేయకుండా పంపించడంతో పాటు విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం బొల్లంపల్లి గ్రామానికి చెందిన విలేజ్ బుక్‌కీపర్(వీవోఏ) జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా డీఆర్‌డీఏ పీడీ అప్పారావు సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మార్గ దర్శకాలకు విరుద్ధంగా వ్యవహరించడంతో వేటు పడింది.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

కోదాడ రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందింది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని కొమరబండ గ్రామంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మహిమూద్, నస్రిన్ దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. పిల్లలకు స్నానం చేయించేందుకు వాటర్ హీటర్‌తో వేడి చేస్తుండగా షేక్ నస్రిన్(30) విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయింది. వెంటనే ఆమెను కోదాడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. భర్త మహిమూద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

మేతకు వెళ్లి గేదె..

వలిగొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో పాడి గేదె బుధవారం మృతిచెందింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని దుప్పెల్లి గ్రామానికి చెందిన రైతు పలుసం నర్సయ్యకు చెందిన పాడి గేదె వ్యవసాయ క్షేత్రంలో మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు మోటర్ వద్ద ఉన్న విద్యుత్ వైరుకు తగిలి మృతిచెందింది. గేదె విలువ సుమారు రూ.80వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

దరఖాస్తుల ఆహ్వానం

కనగల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ టెన్త్ ప్రవేశాలకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఓపెన్ టెన్త్ పాఠశాల కోఆర్డినేటర్ విద్యాభార్గవి, అసిస్టెంట్ కోఆర్డినేటర్ ఆరూరి జానయ్య కోరారు.



సంక్షేమ పథకాలు అమలు చేస్తాం

నకిరేకల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రానున్న కాలంలో మరిన్ని సంక్షేమపథకాలు అమలు చేస్తుందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని సాయిబాబా కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులకు ఆయన చెక్కుల పంపిణీ చేసి మాట్లాడారు. ఇందిరాగాంధీ ఈ దేశానికి గొప్ప పరిపాలన అందించారని గుర్తు చేశారు. మహిళల ఆర్థిక శక్తిని పెంచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సోలార్ పవర్‌ప్లాంట్‌కు 4 ఎకరాల భూమిని ఇవ్వనున్నట్లు తెలిపారు. సందర్భంగా నకిరేకల్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయం చైర్మన్ వెంకటయ్య, ధర్మకర్తలను ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు.

కట్టంగూరు: దారిద్రరేఖకు దిగువన ఉన్న నిరుపేదలకు ప్రభుత్వం ఇచ్చే రేషన్ బియ్యాన్ని సకాలంలో అందించాలని ఎమ్మెల్యే వీరేశం అన్నారు. మండలంలోని బొల్లేపల్లి గ్రామంలో కొత్తగా మంజూరైన రేషన్ దుకాణాన్ని ఆయన ఆయన ప్రారంభించారు. రేషన్‌డీలర్లు సమయపాలన పాటించి రేషన్ బియ్యానికి వచ్చే ప్రజలకు సరుకులను ఇవ్వాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్లు, మునిసిపల్ చైర్‌పర్సన్ చెవుగోని రజిత శ్రీనివాస్, డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి, డీపీఎం మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

● *యువజన కాంగ్రెస్ నూతన కమిటీలు*



ప్రమోద్‌రెడ్డి | వేముల గోపీనాథ్ | తిరుగుడు రవి

మునుగోడురూరల్, శాలిగౌరారం, నార్కట్‌పల్లి, చిట్యాల రూరల్, కేతేపల్లి, నల్లగొండ డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాం గ్రెస్ పార్టీ బలోపేతానికి యువజన కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని పలువురు యువజన కాంగ్రెస్ నాయకులు అన్నా రు. గత మూడు నెలల క్రితం ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించిన యూత్ కాంగ్రెస్ ఎన్నిక ఫలితాలు బుధవారం వెల్లడించారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా మునుగోడు మండల ఎలుగలగూడెం గ్రామానికి చెందిన మేకల ప్రమోద్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో గెలవడానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. యూత్ కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐని బలోపేతం చేస్తూ యువత రాజకీయాల్లో ప్రోత్సహించే విధంగా కృషి చేస్తానని అన్నారు. యూత్ కాంగ్రెస్‌ను బలోపేతం చేసి క్షేత్రస్థాయిలో కాంగ్రెస్‌ను పటిష్టం చేసేందుకు కృషి చేస్తానన్నారు.

● మునుగోడు మండలం కొంపల్లి గ్రామానికి చెందిన జాలమనియాదవ్ యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

● శాలిగౌరారం మండలం ఉట్కూర్ గ్రామానికి చెందిన వేముల గోపీనాథ్ తుంగతుర్తి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. యూత్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా శాలిగౌరారానికి చెందిన బొల్లికొండ గణేష్ ఎన్నికయ్యారు.

● యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నార్కట్‌పల్లి మండలంలోని కొండపాకగూడెం గ్రామానికి చెందిన తిరుగుడు రవి ఎన్నికయ్యారు.

● నకిరేకల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా చిట్యాల మండలం వెలిమినేడుకు చెందిన ఏనుగు రఘుమారెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పల్లపు చంద్రశేఖర్, పున్న అమరేందర్, నార్కట్‌పల్లికి చెందిన పెద్దింటి అనిల్‌రెడ్డి నియోజకవర్గ జనరల్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. చిట్యాల మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా దామనూరి పృథ్వీ, ఉపాధ్యక్షుడిగా పానుగుల శివకుమార్, జనరల్ సెక్రటరీగా రామిడి శ్రవణ్‌రెడ్డి ఎన్నికయ్యారు.

● కేతేపల్లి మండల అధ్యక్షుడిగా ఉప్పలపహాడ్ గ్రామానికి చెందిన మన్నా అశోక్‌యాదవ్ ఎన్నికయ్యారు. మండల ఉపాధ్యక్షుడిగా మాచర్ల కిరణ్, కార్యదర్శిగా బొడ్డుపల్లి ఉపేందర్‌ను ఎన్నికయ్యారు. అశోక్‌యాదవ్‌ను పార్టీ మండల అధ్యక్షుడు కె. శ్రీనివాసయాదవ్, పలువురు నాయకులు అభినందించారు.

● యువజన కాంగ్రెస్ పార్టీ నల్లగొండ ప్రధాన కార్యదర్శిగా షేక్ జహంగీర్ బాబా ఎన్నికయ్యారు. షేక్ జాహంగీర్ బాబా అధిక మెజార్టీతో గెలుపొందారు. ఈ సందర్భంగా జాహంగీర్ బాబా మాట్లాడుతూ ఎన్నికలో గెలవడానికి సహకరించిన మంత్రి వెంకట్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సీసీఐలు నిబంధనలు పాటించాలి

జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి

నల్లగొండటౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బాలల సంరక్షణ కేంద్రాలు (సీసీఐ) నిబంధనలు పాటించాలని జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి అన్నారు. నల్లగొండ పట్టణంలోని బాలరక్ష భవన్‌లో జిల్లాలోని సీసీఐ ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. బాలల న్యాయ చట్టం ప్రకారం 18 ఏళ్లలోపు బాలలకు ఆశ్రయం కల్పించే సీసీఐలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ లేని వారిపై చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. సీసీఐలలో కనీస ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. హోంనకు అడ్మిషన్ ఇచ్చే సమయంలో, డిశ్చార్జ్ సమయంలో పిల్లలను బాలల సంక్షేమ కమిటీ ముందు హాజరు పరచాలన్నారు. బాలలకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని సూచించారు. బాలల సంరక్షణ కేంద్రాలలోని పనిచేసే ముగ్గురు సిబ్బందితో ఆహార కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో సీడబ్ల్యూసీ చైర్మన్ చింత కృష్ణ, సభ్యులు వెంకన్న, భాస్కర్, బీఆర్‌బీ కో ఆర్డినేటర్ హరిత, డీసీపీవో కాసాని గణేష్, సిబ్బంది ఆర్. తేజస్వీ, ఎన్. విద్య, ఎం.వెంకన్న, ఎన్. రేవతి, వి.రమణి, ఐ.రాము, జె.అంజలి, సీహెచ్. నర్సింహారావు, బి.ఎల్లేశ్వర్, బి.మహేష్, సీహెచ్ బాలకిషన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



శిశుగృహ మేనేజర్‌కు సీసీఐ ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న డీడబ్ల్యూవో కృష్ణవేణి

మ్యూచువల్ బదిలీలకు మార్గదర్శకాలు జారీ

నల్లగొండ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్ యాజమాన్యాలలోని పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు మ్యూచువల్ ఇంటర్ లోకల్ క్యాడర్ బదిలీల కోసం ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో బొల్లారం భిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. బదిలీలకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందని ఆయన తెలిపారు.

తిప్పర్తి, కనగల్‌కు జూనియర్ కళాశాలల మంజూరు

తిప్పర్తి : నల్లగొండ జిల్లాలోని తిప్పర్తి, కనగల్ మండలాలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మంజూరయ్యాయి. జూనియర్ కళాశాలలు మంజూరు చేయాలని మంత్రిని కోరగా ఆయన సానుకూలంగా స్పందించి కళాశాలలు మంజూరు చేయించారు.

కేజీబీవీలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మర్రిగూడ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో ఖాళీగా ఉన్న అతిథి ఉపాధ్యాయ పోస్టులకు అర్హులైన మహిళ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాల ఎస్‌వో జ్యోతి తెలిపారు. పీజీతో పాటు బీఈడీ చదివి ఉండాలని సూచించారు. ఈ పాఠశాలలో టీఆర్టీలో కెమిస్ట్రీ, ఇంగ్లీష్, జువాలజీ, పీఈటీ, డీపీడీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆసక్తి గల మహిళలు రెండు రోజుల్లో మర్రిగూడలోని కేజీబీవీలో దరఖాస్తులు చేసుకోవాలని ఆమె కోరారు.

యాదవ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడిగా నాగరాజు

నల్లగొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): యాదవ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షునిగా బెల్లి నాగరాజుయాదవ్‌ను నియమించారు. జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలగాని వెంకట్‌యాదవ్ ఈ నియామక పత్రాన్ని అందజేసి మాట్లాడారు. యాదవ కులస్థుల అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేస్తున్న నాగరాజును జిల్లా అధ్యక్షుడిగా నియమించినట్లు తెలిపారు. నాగరాజు యాదవ్ మాట్లాడుతూ యాదవులంతా చైతన్యమైనప్పుడు మాత్రమే రాజ్యాధికారం సాధించవచ్చని అన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం భవన ట్రస్ట్ చైర్మన్ చీర పంకజ్ యాదవ్, పల్లెబోయిన కాశీరాములు, బొబ్బల గోపాల కృష్ణ, వంగూరి లక్ష్మీనారాయణ, ఎల్వీ యాదవ్, అల్లి వేణు, గుండెబోయిన సురేష్, చల్లా కోటేష్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి

శాలిగౌరారం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బీజేపీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఎన్నికల ఇన్‌చార్జి కడియం రామచంద్రయ్య అన్నారు. శాలిగౌరారం మండలం అంబారిపేట, చిత్తలూరు గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. అనంతరం అంబారిపేట అధ్యక్షుడిగా నూనె గట్టయ్య, కప్పల శ్రీనివాస్, చిత్తలూరు గ్రామం బూత్ అధ్యక్షుడిగా రాచమల్ల శ్రీనివాస్, సిగ అన్నపూర్ణ, అనిత, రామగిరి, బూత్ అధ్యక్షుడిగా లక్ష్మయ్యను ఎన్నుకున్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు జమ్ము రమేష్, నాయకులు తోట వినోద్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ***

ANDHRAJYOTHY

నల్లగొండ

5 గురువారం 5 డిసెంబరు 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు గుడ్డు డజన్ ధర : 78

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.112	185	205
సూర్యాపేట	రూ.125	190	210
నల్లగొండ	రూ.130	190	220

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.0 । కనిష్ఠం 19.0

సీఎం పర్యటనకు ఏర్పాట్లు ముమ్మరం

- ఈ నెల 7న జిల్లాకు రేవంత్‌రెడ్డి రాక
- బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు, యాదాద్రి పవర్‌ప్లాంట్ ప్రారంభోత్సవాలు
- మెడికల్ కళాశాల ప్రారంభోత్సవం కూడా
- సాయంత్రం ఎన్‌జీ కళాశాలలో భారీ బహిరంగసభ
- ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్ ఇలాత్రిపాఠి





నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లంలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న నల్లగొండ కలెక్టర్ ఇలాత్రిపాఠి

నల్లగొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనకు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఈ నెల ఏడో తేదీన నల్లగొండ జిల్లా పర్యటన ఖరారైన నేపథ్యంలో అధికారులు అన్ని పనులను పూర్తి చేస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడిచిన సందర్భాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తోన్న ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా జిల్లాలో పలు అభివృద్ధి పథకాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. బ్రాహ్మణ వెల్లంల ఎత్తిపోతల పథకం ద్వారా కాల్వలకు నీటి విడుదలతోపాటు, దామరచర్ల మండలం వీర్లపాలెంలోని యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంటులో యూనిట్-2 ద్వారా విద్యుదుత్పత్తికి సీఎం ప్రారంభోత్సవం చేస్తారు. అదేవిధంగా నల్లగొండలోని మెడికల్ కళాశాలను ఆయన ప్రారంభిస్తారు. అక్కడే నర్సింగ్ కళాశాలకు శంకుస్థాపన చేస్తారు. వీటితో పాటు నల్లగొండ మునిసిపాలిటీ పరిధిలోని రైతుబజార్ వద్ద నిర్మించతలపెట్టిన నైపుణ్యాభివృద్ధి కేంద్రానికి, పలు మునిసిపల్ పనులకు సీఎం శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం జిల్లాకేంద్రంలోని ఎన్జీ కాలేజీ ప్రాంగణంలో జరిగే ప్రజాపాలన విజయోత్సవ సభలో సీఎం ప్రసంగిస్తారు. ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి హెలికాప్టర్‌లో

- మిగతా 6వ పేజీలో...

- పథకంపై తేలని ప్రభుత్వ నిర్ణయం
- నిర్మాణం పూర్తయి ఏడాది అవుతుండడంతో శిథిలావస్థకు చేరుతున్న ఇళ్లు
- ప్రభుత్వం పట్టించుకోపోతే కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తవుతున్నా, గత ప్రభుత్వ హయాంలో నిర్మించి వదిలేసిన డబల్‌బెడ్‌రూమ్ ఇళ్ల ని ఇప్పటివరకు లబ్ధిదారులకు కేటాయించలేదు. దీంతో అవి శిథి లావస్థకు చేరే దుస్థితి నెలకొంది. ఎంతో ఆశతో డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లలోకి వెళతామనుకున్న వారికి నిరాశే ఎదురవుతోంది. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వమైనా తమకు ఇళ్లు కేటాయించకపోతుందా? అని నిరీక్షిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

'డబుల్' పరేషాన్!

రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత గత ప్రభుత్వం నిర్వహించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల పథకాన్ని ఈ ప్రభుత్వం రద్దుచేసింది. దాని స్థానంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తామని ప్రకటించింది. అయితే కొత్తగా ఇళ్లు కావాల్సిన వారికి ఇందిరమ్మ ఇళ్ల పథకం వర్తింపజేయడంలో ఎలాంటి ఆటంకాలు లేకపోయినా, గత ప్రభుత్వం హయాంలో నిర్మించి లబ్ధిదారులకు ఇవ్వకుండా వదిలేసిన ఇళ్ల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంపై అర్హులు, లబ్ధిదారుల్లో అయోమయం నెలకొంది. ఈ ఇళ్ల కేటాయింపులకోసం దాదాపు ఏడాది కాలంగా ఎలాంటి కార్యాచరణ లేకపోవడంతో ఆ ఇళ్లు శిథిలావస్థకు చేరాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం వెచ్చించిన డబ్బు బూడిదలో పోసిన పన్నీరవుతుందని, తక్షణం ఈ ఇళ్లను లబ్ధిదారులకు అందజేయాలని కోరుతున్నారు.







ఉమ్మడి జిల్లాలో 4,716 డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విఫలమైన పథకంగా డబల్‌బెడ్‌రూమ్ ఇళ్ల పథకం మిగిలిపోయింది. ఇళ్లులేని నిరుపేదలందరికీ డబల్‌బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిస్తామని గొప్పగా ప్రకటించినప్పటికీ పదేళ్లలో లక్ష్యాన్ని చేరలేక ప్రభుత్వం చతికిల పడింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 20వేల ఇళ్లను మాత్రమే మంజూరు చేసినా, వాటిల్లో కేవలం 6,360 ఇళ్లు మాత్రమే నిర్మించారు. నిర్మించిన ఇళ్లల్లోనూ ఎన్నికల సమయానికి కేవలం 1,644 మంది లబ్ధిదారులకు మాత్రమే కేటాయించగా, మరో 4,716 ఇళ్లు అర్హులకు కేటాయించకపోవడం, వాటికోసం ఎన్నికల షెడ్యూల్ వచ్చే వరకూ లబ్ధిదారుల ఎంపిక అప్పటి ఎమ్మెల్యేలు సందిగ్గత కొనసాగించడంతో చివరకు ఆ ఇళ్లను ఎవరికీ కేటాయించలేకపోయారు. దీంతో ఆ ఇళ్లన్నీ ప్రస్తుతం ఎవరూ నివాసం ఉండకపోవడంతో క్రమంగా శిథిలమవుతున్న పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి కూడా ఏడాది గడుస్తున్నందున, తక్షణం ఈ ఇళ్లను లబ్ధిదారులకు ఇస్తేనే ఉపయుక్తంగా ఉంటుందనే సూచనలు వస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం 4,716 ఇళ్లు ప్రస్తుతం నిర్మించి అందుబాటులో ఉన్నాయి. వీటిలో అత్యధికంగా సూర్యాపేట నియోజకవర్గంలో 1,358 ఇళ్లు, నల్లగొండలో 710 ఇళ్లు, మిర్యాలగూడలో 640, కోదాడ లో 560, భువనగిరిలో 641, తుంగతుర్తి 211, నకిరేకల్‌లో 534, ఆలేరులో రెండు ఇళ్లు లబ్ధిదారుల కు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించకపోగా, ఇళ్లు నిర్మించిన కాలనీల్లోనూ పూర్తిస్థాయిలో రోడ్లు, విద్యుత్ సదుపాయాలు, తాగునీటి పైప్‌లైన్ల నిర్మాణాలు, డ్రైనేజీల నిర్మాణాలు ఇంకా పూర్తిగా చేపట్టలేదు. వీటికి కూడా నిధులు మంజూరైనా పనులు చేయకపోవడంతో ఆ నిధులన్నీ వెనక్కిపోయాయి. ప్రస్తుతం తక్షణమే లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేసి, మౌలికవసతులు కల్పిస్తే ఈ ఇళ్లకోసం వెచ్చించిన ప్రజాధనం వృథా కాకుండా కాపాడిన వారవుతారని,ఈ అంశంపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టిసారించాలని అర్హులైన లబ్ధిదారులు కోరుతున్నారు. ఈ ఇళ్ల కేటాయింపులు, మౌలికవసరుల కల్పనపై హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్‌ని 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా, ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదని, తదుపరి ఆదేశాలొచ్చే వరకూ యథాతథంగా వాటిని సంరక్షిస్తామని పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

నాణ్యమైన ఆహారం అందించాలి

సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్



వసతిగృహ అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్

దామరచర్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ అన్నారు. మండలకేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించిన అనంతరం వంట గదిని పరిశీలించారు. అనంతరం ఆయన విద్యార్థులతో మాట్లాడి వసతులపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ ఉన్నారు.

ప్రజా సమస్యలను గాలికొదిలేసిన ప్రభుత్వాలు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీరయ్య

ముగిసిన జిల్లా మహాసభలు

సీపీఎం జిల్లా కార్యదర్శిగా వీరారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వీరయ్య

ప్రజా సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాలికొదిలేశాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీరయ్య అన్నారు. మిర్యాలగూడలో సీపీఎం జిల్లా మహాసభల ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల జీవితాలతో ఆటలాడుకుంటున్నాయన్నారు.

6

భయపెట్టిన భూ ప్రకంపనలు



- సెకన్లపాటు కంపించిన భూమి
- ఆందోళన చెందిన ప్రజలు

7

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

కలెక్టర్ ఇలాత్రిపాఠి



జిల్లాకేంద్రంలో సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి, సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

నల్లగొండ టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన ఈ నెల 7న ఉన్నందున అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై బుధవారం ఆమె కలెక్టరేట్‌లో సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్, రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, తదితర అధికారులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి హాజరయ్యే ప్రదేశాలు, అక్కడ చేయాల్సిన ఏర్పాట్లు, పోలీస్ బందోబస్తు, తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల నిమిత్తం సీఎం రానున్నందున అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. సీఎం పర్యటన ఏర్పాట్లలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ మాట్లాడు తూ ముఖ్యమంత్రి రాక సందర్భంగా అవసరమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు జేసీ శ్రీనివాస్, అదనపు ఎస్పీ రాములు నాయక్, ఇరిగేషన్ సీఈ అజయ్ కుమార్, ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఇరిగేషన్ అధికారులు, ఆర్డీవో అశోక్ రెడ్డి, డీఎస్పీ శివరాంరెడ్డి పాల్గొన్నారు.

థర్మల్ ప్లాంట్ పరిశీలన

దామరచర్ల: యాదాద్రి థర్మల్ ప్లాంట్‌ను సీఎం రేవంత్‌రెడ్డి సందర్శించనున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లను మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. సీఎం ప్రారంభించనున్న యూనిట్-2ను ఆయన పరిశీలించి ఆ ప్రాంతంలోని ఏర్పాట్లపై జెన్‌కో అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఆయనవెంట సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, డీఎస్పీ రాజశేఖర్‌రాజు, అధికారులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనకు అన్ని ఏర్పాట్లను చేస్తున్నామని కలెక్టర్ ఇలాత్రిపాఠి తెలిపారు. సీఎం ఇతర జిల్లా మంత్రులతో కలిసి నార్కట్‌పల్లి మండలంలోని బీ.వెల్లెంల ఉదయ సముద్రం ఎత్తిపోతల ప్రాజెక్టును ప్రారంభించనున్న దృష్ట్యా చేయాల్సిన ఏర్పాట్లపై ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఇతర జిల్లా అధికారులతో కలిసి బుధవారం ఆమె బీ.వెల్లెంల ఉదయ సముద్రం ప్రాజెక్టును పరిశీలించారు. రిజర్వాయర్ కట్ట దిగువన ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌ను, పైలాన్‌ను ఆమె పరిశీలించి తగు సూచనలు చేశారు. కలెక్టర్‌వెంట అదనపు ఎస్పీ రాములు నాయక్, నీటిపారుదల శాఖ సీఈ అజయ్‌కుమార్, ఈఈ గంగం శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో అశోక్‌రెడ్డి,డీఎస్పీ శివరాంరెడ్డి,ఇతర అధికారులు ఉన్నారు.

నిబంధనల మేరకు ప్రణాళికలు రూపొందించాలి

నల్లగొండ: స్థానిక సంస్థల్లో 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి, నియమ నిబంధనల ప్రకారం 2024-25 సంవత్సరానికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం ఆమె జిల్లా పరిషత్ కార్యాలయంలో 2024-25 సంవత్సరానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగానికి రూపొందించే కార్యాచరణ ప్రణాళికపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీ భవనాలు, ఆరోగ్య ఉపకేంద్రాలు, రైతు వేదికలు అన్ని ప్రభుత్వ సంస్థలకు తాగునీరు అందించేందుకు ప్ర ణాళికలో చేర్చాలన్నారు. ఈ విషయమై ప్రత్యేకాధికారు లు శ్రద్ధ తీసుకోవాలన్నారు. స్థానిక పరిస్థితులను ఆధారంగా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డిప్యూటీ సీఈవో శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల అస్వస్థతపై విచారణ

ఆహార పదార్థాలను ల్యాబ్‌కు పంపిన అధికారులు

పెద్దఅడిశర్లపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): దుగ్యాల ఆదర్శ బాలికల వసతిగృహంలో ఐదుగురు విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై బుధవారం విచారణ కొనసాగింది. సివిల్‌సప్లయ్ జిల్లా అధికారి హరీష్, డీఎంహెచ్‌వో డాక్టర్ పట్ల శ్రీనివాస్ విచారణ చేపట్టారు. ఈ నెల 3వ తేదీన సాయంత్రం ఐదుగురు విద్యార్థులు కడుపునొప్పి, తలనొప్పితో దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. విషయం తెలిసిన వెంటనే అదే రోజు రాత్రి కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆస్పత్రికి వెళ్లి విద్యార్థులను పరామర్శించి, ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలుసుకోవాలని ఆదేశించారు. దీంతో బుధవారం ఉదయం సివిల్‌సప్లయ్ జిల్లా అధికారులు, వైద్యాధికారులు ఆదర్శ పాఠశాలకు చేరుకుని సిబ్బందిని, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ఎమ్మెల్యే బాలూనాయక్ పాఠశాలను సందర్శించి,అక్కడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.మూడు రోజులుగా సరైనఆహారం తీసుకోకపోవడంతో విద్యార్థులు డీహైడ్రేషన్‌కు గురయ్యారన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

- హిందూ ఐక్యవేదిక డిమాండ్



జిల్లాకేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ ఐక్యవేదిక కార్యకర్తలు, నాయకులు

నల్లగొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని హిందూ ఐక్యవేదిక నల్లగొండ అధ్యక్షుడు నేతి రఘుపతి, ప్రధాన కార్యదర్శి కట్టి సూర్య సపంత్ డిమాండ్‌చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న ఘటనలకు నిరసనగా బుధవారం హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హింసకు పాల్పడిన దోషులపై చర్యలు తీసుకోవడంలో బంగ్లాదేశ్ ప్రభుత్వం ప్రేక్షక పాత్ర వహిస్తుందన్నారు. అనంతరం కలెక్టర్ ఇలాత్రిపాఠిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వేదాంతం రామకృష్ణ, అంజిరెడ్డి, రమేష్, రాంప్రసాద్, వెంకటయ్య, హరి రామకృష్ణ, గార్లపాటి వెంకటయ్య, కాశమ్మ, కన్నెబోయిన వెంకట్, నరేష్, సంపత్, ఇటికాల కృష్ణయ్య, వీరేష్, సైదులు, బండారు ప్రసాద్, మాదగోని శ్రీనివాస్ గౌడ్, గోపికృష్ణ, నాగం వర్షిత్ రెడ్డి, శ్రవణ్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవాలతో ప్రజాధనం దుర్వినియోగం

జడ్పీ మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల



సమావేశంలో మాట్లాడుతున్న కంచర్ల భూపాల్‌రెడ్డి, పక్కన నరేందర్‌రెడ్డి

నల్లగొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఏడాది పాలనపై విజయోత్సవాల పేరిట ప్రజాధనాన్ని ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి విమర్శించారు. జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ నోటిఫికేషన్లు వేస్తే, ఇప్పుడు తాము ఉద్యోగాలు ఇచ్చినట్లు అబద్ధపు ప్రచారం చేసుకుంటురని విమర్శించారు. ఈ నెల 7న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నల్లగొండ పర్యటనకు వస్తున్న సందర్భంగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి రూ.250కోట్లు, ఏఎమ్మార్పీ ప్రాజెక్టుకు రూ.1500కోట్లు కేటాయించాలని వినతిపత్రం అందజేస్తామన్నారు. నల్లగొండ అభివృద్ధికి గత ప్రభుత్వం రూ.1350కోట్లు కేటాయించిందని, ఆ పనులను కొనసాగించాలని కోరారు. తెలంగాణ సంపదను దోచుకున్న కాంగ్రెస్ ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల కోసం ఖర్చు పెడుతుందని ఆరోపించారు. రైతు భరోసా ఇవ్వడంలో నిర్లక్ష్యం చేస్తోన్న ప్రభుత్వం రుణమాఫీ కూడా పూర్తి చేయలేదన్నారు. ఎనిమిది కేసులు ఎదుర్కొంటు న్న ఓ క్రిమినల్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మాజీ మంత్రి హరీష్‌రావుపై కేసులు నమోదు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు కటికం సత్తయ్యగౌడ్, నిరంజన్‌వలీ, బొర్ర సుధాకర్, మందడి సైదిరెడ్డి, బోనగిరి దేవేందర్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, అభిమన్యు శ్రీనివాస్, కరీంపాషా, నారబోయిన భిక్షం, గోవర్ధన్, సహదేవారెడ్డి పాల్గొన్నారు.

ఏం సాధించారని.. ప్రజా విజయోత్సవాలు : చిరుమర్తి

నార్కట్‌పల్లి: ఏం సాధించారని, ప్రజలకు ఏం మేలు చేసిందని ప్రభుత్వం ప్రజా విజయోత్సవాలు నిర్వహిస్తోందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రశ్నించారు. నార్కట్‌పల్లిలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులు కష్టించి పండించిన ధాన్యాన్ని నష్టానికి మిల్లర్లకు అమ్ముకున్నందుకా.. బోనస్ ఇస్తానని బోగస్ చేసినందుకా.. .గురుకులాలను నరక కూపాలుగా మార్చినందుకా అని ప్రశ్నించారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భైరెడ్డి కరుణాకర్‌రెడ్డి, మేకల రాజిరెడ్డి, దుబ్బాక శ్రీధర్, వాజిద్, శంకర్ పాల్గొన్నారు.

కుట్రల వెనుక ప్రవీణ్‌కుమార్ హస్తం

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



సమావేశంలో మాట్లాడుతున్న దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్

పెద్దఅడిశర్లపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలల్లో కుట్రల వెనుక బీఆర్ఎస్‌నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హస్తముందని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ ఆరోపించారు. మండలకేంద్రంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ బదనాంచేయాలని చూస్తోందన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ గురుకులాల కార్యదర్శిగా పనిచేశారని, తన అనుచరులనే సిబ్బందిగా నియమించుకున్నారని ఆరోపించారు. అన్ని హాస్టల్స్‌లో ప్రవీణ్‌కుమార్ అనుచరులు ఉన్నారని, త్వరలోనే అన్ని విషయాలు బయటకు వస్తాయన్నారు. గత ప్రభుత్వంలో ఎప్పుడైనా విద్యార్థుల గురించి అలోచించారా అని ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం 40శాతం కాస్మోటిక్ చార్జీలు పెంచిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరబోయిన ఎల్లయ్యయాదవ్, సతీష్‌రెడ్డి, వంగాల ప్రతాప్‌రెడ్డి, బోడియానాయక్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు, తిరుమలగిరి, మేడారం, చింతల్ తండా గ్రామాలో నూతనంగా సీసీరోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బాలునాయక్ శంకుస్థాపన చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను ప్రభుత్వం అమలు చేసి చూపించిందన్నారు. గత ప్రభుత్వ హయంలో ఒక కుటుంబం అధికార ధన దాహానికి తెలంగాణ రాష్ట్రం ఆగమై అప్పులపాలైందన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు.

విద్యార్థినులకు పరామర్శ

దేవరకొండ: పీఏపల్లి మోడల్‌స్కూల్ విద్యార్థులకు ఎలాంటి ఫుడ్‌పాయిజన్ జరగలేదని, కడుపునొప్పి రావడంతో అస్వస్థతకు గురయ్యారని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. అస్వస్థతకు గురై దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను బుధవారం పరామర్శించారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధం

- బీఆర్ఎస్, బీజేపీ నేతలకు కనీస అవగాహన లేదు



సమావేశంలో మాట్లాడుతున్న బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన అభివృద్ధి పనులపై చర్చకు సిద్ధంగా ఉన్నామని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, నల్లగొండ మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. నల్లగొండ నియోజకవర్గంలో మంత్రి వెంకట్‌రెడ్డి చేసిన అభివృద్ధి బీఆర్ఎస్, బీజేపీ నాయకులకు కన్పించడం లేదా అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో రోడ్లు, ట్రాన్స్‌ఫార్మర్‌లు, మెడికల్ కళాశాల, ఆర్డీవో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, ఎంజీ యూనివర్సిటీ, రైల్వే ఫ్లైఓవర్, నల్లగొండలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీరోడ్లన్నీ మంత్రి వెంకటరెడ్డి హయాంలో జరిగిన పనులేనని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశామన్నారు. మాస్టర్ ప్లాన్ గురించి అవగాహన కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. నల్లగొండ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి ఎప్పటికీ ఎమ్మెల్యేగా గెలవలేడని అన్నారు. ఈ నెల 7న జరిగే సీఎం రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మునిసిపల్ వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్, నల్లగొండ, తిప్పర్తి, కనగల్ మాజీ జడ్పీటీసీలు వంగూరి లక్ష్మయ్య, పాశం రాంరెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, అనుపరెడ్డి పాల్గొన్నారు.

పార్కింగ్‌కు చోటేదీ?

ప్రధాన వాణిజ్య కూడలిగా కొనసాగుతున్న మిర్యాలగూడ పట్టణవాసులకు ట్రాఫిక్ ఇక్కట్లు తప్పడం లేదు. 1.35 లక్షల కు పైగా జనాభా కలిగి ఉండి 8 మండలాలకు ట్రేడ్ సెంటర్‌గా విస్తరించి రోజు ముప్పై వేల మంది కి పైగా వచ్చిపోయే వాహనదారులు, వినియోగదారులు, ప్రయాణికులతో వారంలో ఆరు రోజులు పట్టణ రోడ్లపై రద్దీ నెలకొంటోంది. ప్రధానంగా మునిసిపల్ నిబంధనలకు విరుద్ధంగా నిరిస్తున్న భవనాలు, అపార్ట్‌మెంట్లు, షట్టర్లతో పట్టణంలోని అనేక వీధుల్లో పార్కింగ్ సమస్య తలెత్తుతోంది. దీంతో అనేక సార్లు ద్విచక్ర వాహనాల రాకపోకలకు సైతం ఇబ్బందికరంగా మారుతోంది. యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ ప్రారంభమైతే ట్రాఫిక్ మరింత పెరిగే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసినా సిబ్బంది కొరత వెంటాడుతోంది. పార్కింగ్ స్థలాలు లేక రోడ్డుపైనే వాహనాలు నిలుపుతుండటంతో కొన్ని సమయా ల్లో ట్రాఫిక్ నియంత్రించడం కష్టంగా మారుతోంది.

- (ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ)


పట్టణ వాసులకు ట్రాఫిక్ వెతలు

పట్టణంలో పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ఇరుకు వీధులకు తోడు రోడ్లపైనే వాహనాలను నిలిపిఉంచడంతో ఫోర్‌వీలర్, టూవీలర్ వాహనాల రాకపోకలకు వీలు కాక రోడ్లపై ట్రాఫిక్ రద్దీ పెరుగుతుంది. బ్యాంకులు, ఆసుపత్రులు, హోటళ్లు, మద్యం దుకాణాల ముందు వాహనాలను రోడ్డుపైనే అడ్డదిడ్డంగా నిలిపివుంచడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని పట్టణవాసులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా డాక్టర్స్ కాలనీలో వాహనాల పార్కింగ్‌తో ఆటోలు కూడా ప్రయాణించే మార్గంలేక చికిత్స కోసం ఆస్పత్రి వరకు నడవలేని రోగులు అవస్థలు పాలు కావాల్సివస్తోంది. సాగర్‌రోడ్డు, చర్చిరోడ్డు, గాంధీ బొమ్మ ఎదురుగా రెడ్డికాలనీకి వెళ్లే రోడ్డు, గణేష్ మార్కెట్, కోదాడ రోడ్డులో రాజీవ్‌చౌక్ నుంచి పోస్టాఫీస్ వరకు, స్వాగత్ హోటల్ రోడ్లు పిల్లలు పాఠశాలలకు వెళ్లి వచ్చే సమయాల్లో మరింత రద్దీగా మారుతున్నాయి. కొన్ని రోజుల పాటు రాఘవ థియేటర్ నుంచి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లే దారిని బారికేడ్లతో మూసివేసి వన్‌వేగా మార్చినా ఫలితం లేకపోవడంతో వన్‌వేను ఎత్తివేశారు. టౌన్ ప్లానింగ్ అధికారుల అలసత్వం, రాజకీయ అండదండలతో పార్కింగ్ కోసం సెల్లార్‌ల ఏర్పాటు లేకుండానే బహుళ అంతస్థుల భవనాలు నిర్మిస్తున్నారు. దీంతో జనాభా పెరుగుతున్న కొద్దీ ట్రాఫిక్ సమస్యలు పెరుగుతూ వస్తున్నాయనేది స్థానికుల అభిప్రాయం. అవసరమైతే అనుమతులు లేకుండా పిల్లర్లతో నిర్మించిన అపార్ట్‌మెంట్ల గ్రౌండ్ ఫ్లోర్ గోడలను కూల్చి పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేసుకునేటట్లు చూడాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

సిబ్బంది కొరతతో నిరుపయోగంగా డ్యూటీ పాయింట్లు

పట్టణంలో రోడ్లపై రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేకంగా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసినా సిబ్బంది కొరత వెంటాడుతోంది. పట్టణంలో ప్రధాన బిజినెస్ రోడ్డుగా కొనసాగుతున్న సాగర్ రోడ్డుపై రద్దీ ఎక్కువగా ఉండటంతో నియంత్రణకు ట్రాఫిక్ డ్యూటీ పాయింట్లు ఏర్పాటు చేశారు. రాజీవ్ చౌక్, గణేష్ టెంపుల్, బస్టాండ్ ఇన్, అవుట్, ఇందిరా గాంధీ విగ్రహం, ఫ్లైఓవర్ ఐదు చోట్ల పాయింట్లు ఏర్పాటు చేసినా సిబ్బంది కొరతతో రెగ్యులర్‌గా పీసీలు డ్యూటీ చేయడానికి వీలుకాకుండా పోతోంది. ట్రాఫిక్ స్టేషన్‌లో 21 మంది పోలీసులు 10 మంది హోంగార్డులకు గాను 10 మంది పీసీలు, ముగ్గురు హెచ్‌సీ ఉండగా ఐదుగురు హోంగార్డులు మాత్రమే ఉన్నారు. పలు కూడళ్లల్లో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఆచరణ రూపం దాల్చకపోవడంతో పట్టణవాసులకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు.



దుకాణాల ముందు స్థలం లేక రోడ్లపైనే పార్కింగ్



పెద్దపెద్ద షాపింగ్ మాల్స్ వద్ద కూడా సరైన పార్కింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేయడం లేదు. వస్తువులు, బట్టలు కొనుగోలు చేయాలంటే వాహనాలను రోడ్లపైనే పార్క్ చేయాల్సివస్తోంది. సాయంత్ర సమయాల్లో సాగర్ మెయిన్‌రోడ్డుపై పెద్దమోరీ నుంచి ఫ్లైఓవర్ వరకు విపరీత రద్దీ ఉంటుంది.

- నూనె రాంబాబు,స్థానికుడు

రద్దీ నియంత్రణకు చర్యలు



హాస్పిటల్ కాలనీలో పార్కింగ్ సమస్యను అధిగమించేందుకు చర్యలు చేపడుతున్నాం. భవన యజమానులతో మాట్లాడి ప్రైవేటు వ్యక్తులను నియమించుకుని వారి బిల్డింగ్‌ల ముందు వాహనాల పార్కింగ్‌ను క్రమబద్ధీకరించే కృషి చేస్తున్నాం. సబ్‌కలెక్టర్, డీఎస్పీ గార్లతో సంప్రదించి ఖాళీ స్థలంలో పార్కింగ్ సౌకర్యం, దాతల సహకారంతో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను నెలకొల్పే ప్రయత్నం చేస్తున్నాం. ఉదయం 8 నుంచి రాత్రి 9 గంటల వరకు మాత్రమే భారీ వాహనాలు పట్టణంలోకి ప్రవేశించేందుకు అనుమతి ఇస్తున్నాం. అతిక్రమిస్తే 1600 వరకు జరిమానా విధిస్తున్నాం. జడ్చర్ల- కోదాడ జాతీయ రహదారి విస్తరణంతో సాగర్ రోడ్డులో తోపుడు బండ్లను వెనక్కి జరిపించి ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నాం.

- బి. మోహన్, ట్రాఫిక్ ఎస్ఐ

టీజీటీయూ మండల అధ్యక్షుడిగా నాగానాయక్

అడవిదేవులపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం (టీజీటీయూ) మండల కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మిర్యాలగూడ పట్టణంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. సంఘం మండల గౌరవ అధ్యక్షుడిగా డి.విద్యాచందర్‌నాయక్, అధ్యక్షుడు ఆంబోతు నాగానాయక్, ప్రధాన కార్యదర్శి కొర్ర శ్రీనునాయక్, ఉపాధ్యక్షులు పి.మౌనిక, పి.భగవాన్‌నాయక్, కోశాధికారిగా ఎన్.విజయలక్ష్మి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు నాగానాయక్ మాట్లాడుతూ మండలంలో సంఘం బలోపేతానికి తమవంతు కృషి చేస్తానని, తమ ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బానావత్ సైదులునాయక్, మూడ్ తిరుపతినాయక్, బాషానాయక్, కొర్ర కృష్ణకాంత్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో అన్నప్రాశన

చింతపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండల కేంద్రంలోని బీసీ కాలనీ 4 వ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం చిన్నారులకు అన్నప్రాశన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ పార్వతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆటపాటలు, బొమ్మలతో విద్యబోధన చెప్పాలని అన్నారు. పౌష్టికాహారం అందించి ప్రతిభావంతులుగా చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో టీచర్ పద్మావతి, ఆయా పుల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

గుర్రంపోడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండలకేంద్రంలో కేజీబీవీ, విద్యావనరుల కేంద్రం ఎదుట బుధవారం సమగ్రశిక్ష ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఇటికాల రమేష్‌కుమార్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలనే తదితర డిమాండ్లతో సమ్మె నోటీసు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ నెల 6,7వ తేదీల్లో జిల్లా కేంద్రంలో జరిగే రిలే నిరాహార దీక్షకు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ డి.విజయలక్ష్మి, సమగ్రశిక్ష అసోసియేట్ అధ్యక్షుడు యాట వెంకట్, సీఆర్‌పీల సంఘం మండల అధ్యక్షుడు ఎం.రమేష్, సీఆర్‌టీలు, పీటీఐలు పాల్గొన్నారు.



విద్యారంగానికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం

● ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి

హాలియా, డిసెంబరు 4: ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తూ మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తుందని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. హాలియా క్యాంపు కార్యాలయంలో బుధవారం సాగర్ నియోజకవర్గంలోని గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న 7,300 మంది విద్యార్థులకు రూ.50లక్షల వ్యయంతో దుప్పట్లు కొనుగోలు చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం మెరుగైన విద్యను అందించాలనే సంకల్పంతో ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలను పరిష్కరించిందని అన్నారు. దీర్ఘకాలికంగా ఇబ్బందులు పడుతున్న పదోన్నతులు, బదిలీలను చేపట్టినట్లు తెలిపారు. అదే విధంగా హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థుల మెస్ చార్జీలను 40 శాతం పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులను కల్పించడం కోసం ఇప్పటికే తన సొంత ఖర్చుతో 15 లక్షల రూపాయల విలువ చేసే డెస్క్ బెంచీలను తయారు చేయించానని త్వరలోనే అందజేయనున్నట్లు తెలిపారు. దివ్యాంగుల కోసం రూ.10 లక్షలతో తాను సొంతంగా మండలానికి ముగ్గురు చొప్పున బ్యాటరీ, సోలార్‌తో నడిచే ట్రై సైకిళ్లను అందజేయనున్నట్లు తెలిపారు. అదే విధంగా సాగర్‌లోని బీసీ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు రోడ్డు దాటడంలో పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తాను, ఎంపీ రఘువీర్‌లు ఇద్దరం కలిసి రూ.50లక్షల రూపాయలతో ఫ్లైవర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా బోయగూడెం, రాజవరం, చేపూరు గ్రామాల్లో నిరుపేదలకు భూమి కేటాయించి పట్టాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. అంతకు ముందు శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు థ్యాంక్యూ జైవీర్ సార్ అనే ఆకారంలో తెల్లని యూనిఫాంతో కూర్చోవడం ఆకర్షణీయంగా నిలిచింది.


హాలియాలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

మునిసిపాలిటీ అభివృద్ధికి కృషి

కార్మికుల సంక్షేమంతో పాటు మునిసిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి అన్నారు. హాలియా మునిసిపాలిటీలో ఏడాది ప్రజాపాలన విజయోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం నిధుల కొరత ఉన్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజాపాలన కొనసాగిస్తుందన్నారు. అనంతరం మునిసిపల్ కార్మికులందరికీ చీరలు, డ్రస్‌లను పంపిణీ చేశారు. అదే విధంగా రెండు సమభావన సంఘాలకు రూ. 30 లక్షల రూపాయల రుణాన్ని అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో పీసీసీ సభ్యుడు కర్నాటి లింగారెడ్డి, మునినిసిపల్ చైర్‌పర్సన్ యడవల్లి అనుపమనరేందర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్లు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, అంకతి సత్యం, కమిషనర్ రామదుర్గారెడ్డి, పీడీ రాజ్‌కుమార్, మండల విద్యాధికారి గుండా కృష్ణమూర్తి, నాయకులు కాకునూరి నారాయణగౌడ్, నందికొండ రామేశ్వరి, గాలి రవికుమార్, కౌన్సిలర్లు వర్రా వెంకటరెడ్డి, ప్రసాద్‌నాయక్, నల్లబోతు వెంకటయ్య, శ్రీనివాస్, చాపల సైదులు, మండల అధ్యక్షుడు కుందూరు వెంకటరెడ్డి, బుచ్చిరెడ్డి, యాదగిరి, కృష్ణానాయక్, సర్వయ్య, చంద్రారెడ్డి, రాజారమేష్‌యాదవ్, ఆంజనేయులు, శ్రీనివాస్‌రెడ్డి, శివ మారయ్య, వెంపటి శ్రీనివాస్, రాజాప్రసాద్ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ విడుదల చేయాలి

మిర్యాలగూడ టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని కోరుతూ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరినట్లు బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్యయాదవ్ కోరారు. బీసీ విద్యార్థుల ఉన్నత విద్యకోసం రూపొందించిన జ్యోతిరావుఫూలే విదేశీ విద్యానిధి పథకం అమలు జరగడం లేదన్నారు. రెండేళ్లుగా ఆ పథకానికి దరఖాస్తు చేసుకుని అప్పులు చేసి విదేశాలకు వెళ్లిన విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

● ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలు వెంటనే విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు గాదగోని మహేష్‌గౌడ్ కోరారు. బుధవారం ఆయన కలెక్టర్ త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. బకాయిల కారణంగా విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారన్నారు.

పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కొండమల్లేపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి మండలకేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో గల దేవత్‌పల్లి గేటు వద్ద ఉన్న ఎస్టీ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శారద బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాళీగా ఉన్న గణితం, జంతుశాస్త్రం పోస్టులకు అర్హులైన వారు 9వ తేదీన డెమో తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడంతో పాటు పరిశుభ్రతను పాటించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలో బుధవారం నిర్వహించిన గురుకులాల ప్రిన్సిపాళ్లు, హాస్టల్ నిర్వాహకులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన సబ్ కలెక్టర్ నారాయణ అమిత్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. నియోజవవర్గ వ్యాప్తంగా ఉన్న గురుకులాలు, ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగించాలని అన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం అందించే భోజన నాణ్యతను పరిశీలించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థులు అనారోగ్యానికి గురికాకుండా సంరక్షించాలని సూచించారు. డివిజన్ స్థాయిలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి మానిటరింగ్ చేయాలని కోరారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సమావేశంలో తహసీల్దార్ హరిబాబు, ఎంపీవో రమేష్, ఎంఈవో బాలునాయక్, గురుకులాల ప్రిన్సిపాళ్లు, అధికారులు పాల్గొన్నారు.


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

ప్రయాణికుల సంక్షేమానికి కృషి : డీఎం

చింతపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సంక్షేమానికి తనవంతుగా కృషి చేస్తున్నట్లు దేవరకొండ డీఎం రమేష్ బాబు అన్నారు. చింతపల్లి మండలం గొడుకొండ్ల గ్రామపంచాయతీలోని వెంకటేశ్వరనగర్ (మాల్) ఆర్టీసీ బస్టాండ్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్టాండ్‌లో రూ.14 లక్షలతో సీసీ నిర్మాణ పనులు చేస్తున్నారు. ప్రయాణికులకు మౌలిక వసతి సౌకర్యాల కల్పన కోసం తగిన చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు. ఆయన వెంట డీఈ అంజయ్య ఏఈ అశోక్, తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఎం రమేష్‌బాబు

బహుమతుల ప్రదానం

దేవరకొండ: ఆర్టీసీ డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు ప్రతీ 15 రోజులకు ఒక్కసారి ముగ్గురు మహిళలను ఎంపిక చేసి బహుమతులు అందజేస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ రమేష్‌బాబు తెలిపారు. దేవరకొండ ఆర్టీసీ డిపోలో బుధవారం లక్కీడ్రా ద్వారా ముగ్గురిని ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. ప్రయాణికులు టిక్కెట్ వెనకాల పేరు, ఫోన్‌నెంబర్ రాసి బస్సులో ఏర్పాటు చేసిన బాక్స్‌లో వేయాలన్నారు. కార్యక్రమంలో డిపో ఏఎం సైదులుయాదవ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులు మృతి చెందుతున్నా పట్టించుకోని ప్రభుత్వం

● బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్

దేవరకొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలలో వరుసగా ఫుడ్‌పాయిజన్ ఘటనలు జరిగి విద్యార్థులు మృతి చెందుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ ఆరోపించారు. దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మోడల్ స్కూల్ విద్యార్థులను బుధవారం ఆయన పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యను సంక్షోభంలోకి నెట్టిందని విమర్శించారు. రాష్ట్రంలో 950 మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురయ్యారని తెలిపారు. 52 మంది విద్యార్థులు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు చనిపోతున్నా ప్రభుత్వం సమీక్ష నిర్వహించి నివారణ చర్యలు చేపట్టడం లేదన్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేముల రాజు, నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డుపల్లి కృష్ణ, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, పొట్ట మధు, ఇలియాజ్, జానీబాబా, నాగరాజు ఉన్నారు.


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినిని పరామర్శించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

ఆరు గ్యారెంటీలతో మోసం చేసిన కాంగ్రెస్ : బీజేపీ

దేవరకొండ, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు వానం నరేందర్‌రెడ్డి, కేతావత్ లాలు నాయక్ అన్నారు. రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు దేవరకొండలో బుధవారం నిర్వహించిన ద్విచక్ర వాహన ర్యాలీని వారు ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు, 66 మోసాలకు పాల్పడిందని అన్నారు. ఎన్నికల్లో మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని, పింఛన్ రూ. 4వేలు ఇస్తామన్న హామీ ఏమైందని వారు ప్రశ్నించారు. రుణమాఫీ, రైతుబంధు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏమి సాధించారని ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహిస్తున్నారో చెప్పాలని వారు ఎద్దేవా చేశారు. బైక్ ర్యాలీలో బీజే పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి సురేష్, నాయకులు అంకూరి నర్సింహ, గుండాల అంజయ్యయాదవ్, చనమోని రాములు, వస్కుల సుధాకర్, గంప ఫణి తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: చింతపల్లి మండల కేంద్రంలో బీజేపీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు మాట్లాడుతూ లగచర్లలో రైతులపై అక్రమ కేసులు పెట్టి అధికారులపై దాడులు చేయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ లబ్ధి కోసమే కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ర్యాలీలో అసెంబ్లీ కన్వీనర్ ఏటి నర్సింహ, బీజేపీ అధ్యక్షుడు శివర్ల రమేష్‌యాదవ్, నాయకులు గుండాల అంజయ్య, అంజినాయక్, వెన్నం శేఖర్, బొడ్డు మహేష్, కట్ట సైదులు, తదితరులు పాల్గొన్నారు.


దేవరకొండలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

'లయన్స్' సేవలు సద్వినియోగం చేసుకోవాలి

నిడమనూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు సద్వినియోగం చేసుకోవాలని నిడమనూరు క్లబ్ అధ్యక్షుడు పోలే డేవిడ్ అన్నారు. మండలకేంద్రంలోని జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు క్లబ్ జిల్లా చైర్మన్ రేపాల మదన్‌మోహన్ బుధవారం రూ.10 వేల విలువైన క్రీడా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ గోపాల్‌రావు, అశోక్, పాంపాటి శ్రీనివాసులు, మెరుగు మధు, ప్రభాకర్, హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని యోగాతో నిరసన

మిర్యాలగూడ టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): యోగా సాధనకు స్థలం కేటాయించాలని కోరుతూ పతంజలి ఆధ్యాత్మిక సంస్థ సభ్యులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో యోగా చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు పొలిశెట్టి లక్ష్మయ్య మాట్లాడుతూ పుష్కరకాలంగా పట్టణ గ్రంథాలయంలోని పై అంతస్థులో సభ్యులందరూ యోగా సాధన చేస్తున్నట్లు తెలిపారు. యోగా సాధన చేసుకునేందుకు స్థలం కేటాయించాలని పలు మార్లు కోరినప్పటికీ ఫలితం లేనందున యోగా సభ్యుల ఇబ్బందిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చేందుకు క్యాంపు కార్యాలయంలో యోగా చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు రామారావు, సూర్యారావు, వీరారెడ్డి, రాచయ్య, వరలక్ష్మి, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.


క్యాంపు కార్యాలయంలో యోగాతో సభ్యుల నిరసన